



Truth of News **RNI NO : APTEL/25/A0239**

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 63 | మంగళవారం 29 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఇజ్రాయిల్ దాష్టీకానికి 55 మంది బలి

**- ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో 17 మంది మృతి**
**- స్వల్పంగా ఆంక్షల సడలింపు సముద్రంలో నీటి బొట్టంతన్న ఐక్యరాజ్య సమితి**

డేర్ అల్ బాలాహ్ - సూర్య వాస్తవం, జూలై 28

ఇజ్రాయిల్ మారణహోమానికి సోమవారం మరో 55 మంది పాలస్తీనా వాసులు బలయ్యారు. వీరిలో ఆహార కేంద్రాల వద్ద

- మిగతా 2లో..

# ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్ దాడి

**- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన**
**- వాయిదాల పర్వంలో ఉభయ సభలు**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 28

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఐదో రోజూ ప్రతిపక్షాలు గళమెత్తాయి. ఇందులో భాగంగా సోమవారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం, వాయిదా తరువాత పెద్దఎత్తున ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసనకు దిగారు. మకరద్వారానికి ఎదురుగా చేపట్టిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, శివదాసన్, జాన్ బ్రిట్టాస్, టీఎంసీ ఎంపీలు డెరిక్ ఓ బ్రెయిన్, సాగరికా ఘోష్, డీఎంకే ఎంపీలు కనిమొళి, ఎ రాజాతో పాటు ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. బీహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా




నినాదాలు చేశారు.
'సర్-ప్రజాస్వామ్యంపై దాడి' అనే భారీ బ్యానర్, ఎస్ఐఆర్‌ను ఆపాలి అనే ప్లకార్డులను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష ఎంపీలు నిరసించారు. ప్రజల అభిప్రాయం లేకుండా, ఎన్నికల తరువాత ఓటర్లను మత, కుల ప్రాతిపదికన వడపోసే ఈ ప్రయత్నాన్ని ప్రజా స్వామ్యాన్ని నాశనం చేసే కుట్రగా ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఓటర్లను తొలగించడం కాదు వారి గొంతుకను వినడమే

- మిగతా 2లో..



## కాల్పుల విరమణకు ఓకే

**- థాయిలాండ్, కంబోడియా అంగీకారం..**
**- తక్షణమే అమల్లోకి**

కౌలాలంపూర్ - సూర్య వాస్తవం, జూలై 28

థాయిలాండ్, కంబోడియా కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇరు దేశాలు తక్షణమే, బేషరతుగా కాల్పుల విరమణకు అంగీకరించాయని మలేషియా ప్రధాని ఇన్వర్ ఇబ్రహీం తెలిపారు. ఏసియాన్ ప్రాంతీయ కూటమికి అధిపతిగా ఉన్న అన్వర్.. ఇరుదేశాల మధ్య చర్చలకు అధ్యక్షత వహించారు. సరిహద్దు వివాదాన్ని ముగించి, సాధారణ స్థితికి తిరిగి రావడమే లక్ష్యంగా థాయ్.. కంబోడియా నేతలతో సమావేశం నిర్వహించారు. తాజాగా ఆ చర్చలు ఫలించి ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చినట్టు

- మిగతా 2లో..

## సుంకాలపై దిగొచ్చిన ట్రంప్

**-ఈయూ-అమెరికా వాణిజ్య ఒప్పందం**
**- తప్పిన వాణిజ్య యుద్ధం ముప్పు**

టర్న్‌బెర్రీ (స్కాట్లాండ్) - సూర్య వాస్తవం, జూలై 28



ఎట్టకేలకు యూరోపియన్ యూనియన్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. పలు ఈయూ ఉత్పత్తులపై పదిహేను శాతం దిగుమతి సుంకం విధించింది. ఈయూపై 30 శాతం సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గతంలో బెదిరించారు.


- మిగతా 2లో..

# భవిష్యత్ నగరంగా అమరావతి

**- సింగపూర్, ఏపీ మధ్య సహకారం కొనసాగాలి**
**- రెండో రోజు పర్యటనలో సిఎం చంద్రబాబు**

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 28

కొత్త ఆలోచనలు, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని భవిష్యత్ నగరంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్య మంత్రి చంద్రబాబు అన్నారు. సింగపూర్‌లో రెండో రోజుల పర్యటనలో భాగంగా పదివేల కుటుంబాలు ఉండే బిడదారి ఎస్టేట్‌ను సిఎం బృందం పరిశీలిం చింది. అక్కడి అధికారులు ప్రాజెక్టు వివరాలను బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణ ఆలోచనలను చంద్రబాబు వారితో పంచుకున్నారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే ప్లాను ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని చెప్పారు. గతంలో జరిగిన కొన్ని



ఘటనల వల్ల కొంత ఆలస్య మైందని, తప్పులను సరిదద్దడంతోపాటు పరస్పర సహకారం కోసం సింగపూర్ వచ్చినట్లు వివరిం చారు. బిడదారి ఎస్టేట్ ప్రాధాన్యతలను పరిశీలించిన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్‌మెంట్, అర్బన్ రీడెవలప్‌మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో సిఎం సమావేశం అయ్యారు. ఎపిలో చేపట్టనున్న అర్బర్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై చర్చించారు. అమరావతిలో నిర్మించే హౌసింగ్ ప్రాజెక్టులో భాగస్వామలు కావాలని వారిని కోరారు.

**పోర్టుల అభివృద్ధి కోసం**

ఆసియాలో అతిపెద్ద కంటైనర్ టెర్మినల్ పోర్టుగా నిర్మిస్తున్న టువాన్‌ను సిఎం బృందం పరిశీలించింది. అక్కడ పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీ సిఇఓ విన్సెంట్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏఐ సాంకేతికత అమలు గురించి వివరాలు తెలుసు కున్నారు. రూ.1.70 లక్షల కోట్లతో పోర్టు నిర్మాణం చేపడుతున్నట్లు సిఇఓ రాష్ట్ర బృందానికి తెలిపారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మించాలని ఆలోచన చేస్తున్న ప్రభుత్వం సింగపూర్ మోడల్‌ను అనుసరించే అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ బృందంలో సిఎంతోపాటు నారా లోకేష్, టిజి. భరత్, ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులతో కలిసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్‌ను సిఎం పరిశీలించారు. స్కూల్ ప్రిన్సిపల్ ఓంగ్ కిమ్ సూన్‌తో మాట్లాడారు. కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలను సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ తరహాలో ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

**గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లకు సహకరించాలి**

గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం భారీ

- మిగతా 2లో..



## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ ప్రమాణ స్వీకారం

2లో

# గిన్నిస్ బుక్‌లోకి 'మెగా పీటీఎం'...

**- టీచర్లకు అంకితం ఇచ్చిన మంత్రి నారా లోకేశ్**
**- 53.4 లక్షల పేరెంట్స్, టీచర్స్ పాల్గొన్న అతిపెద్ద పీటీఎంగా రికార్డ్**
**- విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో కలిపి మొత్తం 1.5 కోట్ల మంది హాజరు**
**- గిన్నిస్ రికార్డ్ సాధనలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన మంత్రి**

అమరావతి- సూర్య వాస్తవం, జూలై 28

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పిందని, ఈ గిన్నిస్ రికార్డు ఉపాధ్యాయులకు అంకితం అని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 5.34 మిలియన్ల (53.4 లక్షలు) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ




విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారితో సహా మొత్తం 15.2 మిలియన్ల (1.5 కోట్లు) మంది ఈ అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగులో భాగమయ్యారు.

జాతీయ విద్యా విధానం ఐదవ వార్షికోత్సవం జూలై 29కి ఒక రోజు ముందు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ గిన్నిస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మెగా పీటీఎంని విజయవంతం చేసేందుకు అవి శ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు.

- మిగతా 2లో..



## ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు

**- పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం : మంత్రి అనగాని**

విశాఖపట్నం- సూర్య వాస్తవం, జూలై 28

రాష్ట్రంలో భూ కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ విశాఖలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, గత ప్రభుత్వంలో కబ్జాకు గురైన భూములకు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఇజ్రాయిల్ దాష్టీకానికి
# 55 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)
జరిగిన కాల్పుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజాలో మానవతా సంక్షోభం దుర్భరంగా మారిన నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతుండటంతో ఇజ్రాయిల్ ఆహార సాయంపై అమలవుతున్న ఆంక్షలను ఆదివారం కొద్దిగా సడలించింది. గాజా నగరం, డేర్ అల్ బాలా, మౌవసి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రోజుకు 10గంటల పాటు మిలటరీ ఆపరేషన్లకు విరామం ఇవ్వనున్నట్లు ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. సాయం అందేందుకు సురక్షితమైన మార్గాలను కూడా కొన్నింటిని నిర్దేశించింది.

**ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో 17మంది మృతి**

గాజాలో ఆహారం అందించే కేంద్రాల వద్ద వేచివున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో 17మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. వీరిలో రాఫా నగరానికి ఉత్తరాన మోరాగ్ కారిడార్‌కు సమీపంలో జరిగిన దాడిలో మరణించిన ఐదుగురున్నారు. దీంతో మొత్తంగా మరణించినవారి సంఖ్య 55కి చేరింది. 80మందికి పైగా గాయపడ్డారు. తీవ్ర పోషకాహారం లోపంతో ఆదివారం ఒక చిన్నారిసహా 14మంది పాలస్తీనియన్లు మరణించారు. పాలస్తీనియన్ల సాగుభూములపై, ఆలీవ్ చెట్లపై ఇజ్రాయిల్ బలగాలు విరుచుకుపడ్డాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ నగరానికి సమీపంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి.

# కాల్పుల విరమణకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)
ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విలేకరుల ఎదుట థారు, కంబోడియా ప్రధానులు, అన్వర్ సమక్షంలో కరచాలనం చేశారు. "కంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయ్ తాత్కాలిక పీఎం పుమ్‌తాత్ వెచాయాచారు జులై 28 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చే తక్షణ, బేషరతు కాల్పుల విరమణకు అంగీకరించారు.". మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు.

# భవిష్యత్ నగరంగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)
ప్రాజెక్టులు చేపట్టిందని, వీటికి సింగపూర్ నుండి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. సింగపూర్ వాణిజ్య పరిశ్రమలశాఖ మంత్రి టాన్ సీ లాంగ్‌తో జరిగిన భేటీలో సిఎం మాట్లా డుతూ గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, కారిడార్లు, పోర్టుల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం కావాలని కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీలోనూ భాగ స్వామ్యం అవసరమన్నారు. నవంబరులో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని టాన్ సీలాంగ్‌ను ఆహ్వానించారు. గృహ నిర్మాణం, సబ్‌సీ కేబుల్ రంగం లో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, కలిసి పనిచేస్తామని సింగపూర్ మంత్రి సిఎంకు తెలిపారు.

# గిన్నిస్ బుక్‌లోకి 'మెగా పీటీఎం'...

(మొదటిపేజీ తరువాయి)
ఈ అరుదైన రికార్డు సాధనలో భాగమైన విద్యార్థులు, ఉపాధ్యా యులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వికాసానికి, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాశాఖ చేస్తున్న కృషిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించడం హర్షనీయమన్నారు.

**రికార్డు నమోదు ఇలా...**

ఈ మెగా పీటీఎం నుంచి సేకరించిన డేటాను నిశితంగా ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డు అధికారికంగా గిన్నిస్ రికార్డు బృందం ధృవీకరించింది. ఇందులో మూడు ఫోటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సంఖ్య మరియు ప్రతి పాల్గొన్న పాఠశాల నుంచి ఇండిపెండెంట్ విట్నెస్ ద్వారా డేటాను లీప్ యాప్ ద్వారా సేకరించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు ఈ అవార్డును నిర్ధారించడానికి 61,000 పాఠశాలల నుండి సేకరించిన డేటాను విశ్లేషించారు. అధికారిక గిన్నిస్ ప్రపంచ రికార్డు ధృవపత్రం ఆగస్టు రెండవ వారంలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేస్తారు.

**ఈ అవార్డు ఎనలేని ప్రోత్సాహం- సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు**

విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ గారి ఆలోచనల మేరకు తీసుకొస్తున్న ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లో భాగంగా అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తున్న ప్రభుత్వం, రాష్ట్ర విద్యా శాఖ, సమగ్రశిక్ష, ఉపాధ్యాయులకు మెగా పీటీఎం నిర్వహణ ద్వారా అందిన గిన్నిస్ అవార్డు ఎనలేని ప్రోత్సాహంగా నిలుస్తుందని సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)
సంబంధించి ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయని తెలిపారు. విశాఖలో భూ కబ్జాలపై రెవెన్యూ విభాగం ప్రత్యేక రిపోర్ట్ తయారు చేస్తోందన్నారు. పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రయివేటు భూములు 22ఎ లో పెట్టకూడదని సిఎం చంద్రబాబు ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు. భూ సమస్యలకు ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి, పరిష్కరించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. విశాఖలో మెట్రో పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. సిఆర్‌జడ్ నిబంధనల ప్రకారం సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ ప్రమాణ స్వీకారం

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 28**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు ఉదయం 10 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించారు. అయితే, జస్టిస్ బట్టు దేవా నంద్ రాకతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతం 29కి చేరింది. ఈయన 2028 ఏప్రిల్ 13 వరకు ఆ పదవిలో కొనసాగుతారు. జస్టిస్ బట్టు దేవానంద్ ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడ టౌన్‌లో 1966 లో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఏ, లా కాలేజీ నుంచి న్యాయవాద పట్టా అందుకున్నారు. విద్యార్థుల సంఘం నాయకుడిగానూ వ్యవహరించారు. 2006 లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు.

# ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్ దాడి

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వాల బాధ్యత అని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. బీహార్ ఎన్నికలకు ముందు కుట్ర పూరితంగా ఎస్ఐఆర్‌ను తీసుకువచ్చారని విమర్శించారు.

**ఉభయ సభల వాయిదాల పర్వం**

వారం రోజుల అవాంతరాలు, ప్రతిష్టంభన అనంతరం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభమ య్యాయి. ఈ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై ఆరు రోజులవుతున్నా ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ, రాజ్యసభ వాయిదాలు పడుతూ వస్తున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశ మయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఆందోళనకు దిగారు. బీహార్‌లో 'సర్' పేరుతో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. మరోవైపు రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష కూటమి ఎంపీలు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. సభలు తిరిగి ప్రారంభమైన తరువాత కూడా అదే సీన్ రిపీట్ కావడంతో లోక్‌సభను మధ్యాహ్నం 1 గంట వరకు, రాజ్యసభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. వాయిదాకు ముందు ప్రతిపక్ష సభ్యుల తీరుపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని మండిపడ్డారు. 'సభలో పోస్టర్లు ప్రదర్శించొద్దని, నినాదాలు చేయవద్దని మీ సభ్యులకు చెప్పండి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానిం చారుసభ్యులు ఈ రీతిన పదేపదే ఆందోళనకు దిగడం సభా గౌరవమర్యాదలను తగ్గిస్తుందని స్పీకర్ అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులకు మాట్లాడే అనుమతి ఉండదని, అయినా ప్రతిపక్ష సభ్యులు నినాదా లతో సభా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తు న్నారని విమర్శించారు. దేశ ప్రజలు ప్రతిపక్షాల తీరును గమనిసు_న్నారని హెచ్చరించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమా వేశంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు అంగీకారం తెలిపి, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ఆయన ప్రశ్నిం చారు. గంట విరామం తరువాత ప్రారంభమైన సభ.. వెంటనే వాయిదా పడింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలతో సభను 2 గంటల వరకూ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభలో సిందూర్‌పై చర్చ చేపట్టారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన రాజ్యసభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసా గింది. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

# సుంకాలపై దిగొచ్చిన ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)
అయితే ఇప్పుడు దిగివచ్చి టారిఫ్‌ను పదిహేను శాతానికి పరిమితం చేశారు. ఫలితంగా అమెరికా, ఈయూ మధ్య వాణిజ్య యుద్ధ ప్రమాదం తప్పింది. ప్రపంచ వాణిజ్యంలో ఈ రెండు పక్షాల వాటా దాదాపు మూడో వంతు ఉన్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. పశ్చిమ స్కాట్లాండ్‌లో ట్రంప్‌నకు చెందిన అత్యంత విలాసవంతమైన గోల్ఫ్ కోర్సులో ఆయనకు, యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు ఉర్సులా వన్ డర్ లెయాన్‌కు మధ్య ఆదివారం ఒప్పందం కుదిరింది.

ఈ విషయాన్ని ఇరువురు నేతలు ప్రకటించారు. వాణిజ్య ఒప్పందంపై ఇరు పక్షాల మధ్య అనేక నెలలుగా చర్చలు జరుగుతున్నాయి. చివరికి ఎట్టకేలకు గోల్ఫ్ కోర్సులో గంట సేపు జరిగిన సంప్రదింపుల కారణంగా అంగీకారం కుదిరింది. తాను కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలలో ఇదే అతి పెద్దదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో 600 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని ఈయూ యోచించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులతో అమెరికా ఇంధన, సైనిక పరికరాల కొనుగోళ్లు నాటకీయంగా పెరుగుతాయి. గత వారం జపాన్‌తో కుదుర్చుకున్న 550 బిలియన్ డాలర్ల ఒప్పందంతో పోలిస్తే ఇదే పెద్దదని ట్రంప్ చెప్పారు. అమెరికా ఎగుమతుల విషయంలో అన్యాయంగా వ్యవహరించారని, ఇప్పుడు ఈ ఒప్పందంతో అట్లాంటిక్ సముద్రం సమీపంలో లేదా సరిహద్దున ఉన్న దేశాల మధ్య సంబంధాలు విస్తృతమవుతాయని తెలిపారు. కాగా ట్రంప్‌తో చర్చించడం చాలా కష్టంతో కూడిన వ్యవహారమని, ఇంతకంటే ఎక్కువగా ఆ దేశం నుంచి పొందలేమని లెయాన్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచంలో రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది చాలా పెద్ద ఒప్పందం. భారీ ఒప్పందం. ఇది స్థిరత్వాన్ని కల్పిస్తుంది. అంచనాలకు అవకాశం ఇస్తుంది' అని ఆమె చెప్పారు.

ఈ ఒప్పందంతో ఈయూ 750 బిలియన్ డాలర్ల విలువ కలిగిన అమెరికా ఇంధనాన్ని కొనుగోలు చేస్తుందని, వందల బిలియన్ డాలర్ల ఆయుధాలు కొంటుందని ట్రంప్ తెలిపారు. ఒప్పందంపై జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మర్జ్ హర్షం వ్యక్తం చేస్తూ వాణిజ్య యుద్ధం ముప్పు తప్పిందని చెప్పారు. అయితే యూరప్‌లో అనేక మంది జీరో-ఫర్-జీరో ఒప్పందం కుదురుతుందని ఆశించారు. అమెరికా విధించిన పదిహేను శాతం సుంకం చాలా ఎక్కువని వారు అభిప్రాయపడ్డారు.

**స్టాకహోమ్‌లో అమెరికా, చైనా చర్చలు**


ఇదిలావుండగా అమెరికా, చైనా నాయకులు స్వీడన్ రాజధాని స్టాకహోమ్‌లో సమావేశమై వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నారు. సుంకాలు ప్రస్తుత స్థాయిలోనే ఉండే విధంగా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరు దేశాల అధ్యక్షులు ఈ సంవత్సరం చివరలో సమావేశం కావాల్సి ఉంది. అప్పుడు వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్, చైనా వైస్ ప్రీమియర్ హీ లిఫెంగ్ సోమవారం చర్చలు మొదలు పెట్టారు. వీరిద్దరూ ఇలా సమావేశం కావడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. నాలుగు నెలల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై 145 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రెండు దేశాల నేతల మధ్య చర్చలు జరగలేదు. స్కాట్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ట్రంప్ విలేకరులతో ముచ్చటిస్తూ చైనాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కాగా రెండు దేశాల మధ్య ఇప్పటికే జెనీవా, లండన్‌లో రెండు విడతలుగా చర్చలు జరిగాయి. రెండు విడతలుగా జరిగిన చర్చల ఫలితంగా సుంకాల విషయంలో 'యధాతథ స్థితికి' చేరుకున్నామని బెస్సెంట్ చెప్పారు. చైనా నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై అమెరికా 30 శాతం సుంకం విధిస్తే అమెరికా నుంచి వస్తున్న ఉత్పత్తులపై చైనా 10 శాతం టారిఫ్ విధించిందని ఆయన వివరించారు. ఆర్థిక సంబంధాలను సమతూకం చేసుకునే విషయంపై ఇప్పుడు దృష్టి సారిస్తామని అన్నారు. అమెరికా గత సంవత్సరం 295.5 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును నమోదు చేసుకున్న విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. వాణిజ్య ఒప్పందం కుదిరితే చైనాకు ఎగుమతులు పెరుగుతాయని అమెరికా భావిస్తోంది. చర్చలలో మరింత ఏకాభిప్రాయం సాధ్యపడుతుందని, సహకారం పెరుగుతుందని, దురాభిప్రాయం తగ్గుతుందని ఆశిస్తున్నామని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం తెలిపింది.

# పహల్గాంకు పాక్ ఉగ్రవాదులు ఎలా వచ్చారు?

- ఇప్పటి వరకు వారిని ఎందుకు పట్టుకోలేదు
- మన దేశ అంతర్గత వ్యవహారంపై అమెరికా
- జోక్యమెందుకు? : పార్లమెంట్ సాక్షిగా విపక్షాల నిలదీత
- దేశ భద్రతా దళాల చర్యలకు మద్దతు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 28**

పహల్గాంకు పాక్ ఉగ్రవాదులు ఎలా వచ్చారు?, మన దేశ అంతర్గత వ్యవహారంపై అమెరికా జోక్యమెందుకు చేసుకుంటోంది? అంటూ పార్లమెంట్ సాక్షిగా ప్రతి పక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశాయి. పహల్గాంలో భద్రతా లోపాల గురించి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఉగ్రవాదులు పర్యాటక ప్రాంతానికి ఎలా చేరు కున్నారు? వారిని ఎవరు రక్షించారు వంటి ప్రశ్నలకు సమాధానాలు దేశానికి అవసరమని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. సోమవారం లోక్‌సభలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేశ భద్రతా దళాల చర్యలకు మద్దతు తెలిపిన ప్రతిపక్షాలు, ప్రభుత్వం వ్యవహరించిన తీరు, దేశ విదేశాంగ విధానానికి జరుగుతున్న నష్టం, అమెరికా జోక్యం తదితర



అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించాయి. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గోగోరు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ గురించి రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ చాలా విషయాలు చెప్పారనీ, కాని పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా వచ్చారో చెప్పలేదని అన్నారు.

వేల మంది టూరిస్టులుండే ఈ ప్రాంతానికి ఆ ఐదుగురు ఉగ్రవాదులు ఎలా వచ్చారని, వారి ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. అంతేకాక వారిని ఇప్పటి వరకు ఎందుకు పట్టుకోలేదని అడిగారు. ఈ విషయానికి సంబంధించి ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. పహల్గాం ఘటనను ఇన్‌ఫర్మేషన్ వార్ అని పేర్కొన్నారు. మతం ఆధారంగా ప్రజల్ని టార్గెట్ చేయవద్దని గోగోరు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి కేంద్రమంత్రి అమిత్ షా బాధ్యత వహించాల న్నారు. దీనికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను బలి చేయొద్దని చెప్పారు. అదే విధంగా రఫేల్ యుద్ధ విమానాలను కోల్పోయిన అంశంపై త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ అంశాన్ని ఆయన గుర్తు చేశారు. పాకిస్తాన్, భారత్ మధ్య కాల్పుల విరమణ తన వల్లే జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 26 సార్లు వెల్లడించారని, దీనిపై నిజం ఏంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి, సిందూర్ ఆపరేషన్ తరువాత జరిగిన అంతర్జాతీయ దౌత్యం గురించి వెల్లడించా లని పట్టుబట్టారు. పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ రుణం అందకుండా ఇండియా ఎందుకు అడ్డుకోలే దనీ, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారో ప్రధాని మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు.

**దేశం ఆపరేషన్ తందూర్‌ను కోరుకుంది : సమాజ్‌వాదీ పార్టీ నేత**

పహల్గాం ఉగ్రదాడి తరువాత దేశం ఆపరేషన్ తందూర్‌ను కోరుకుందని సమాజ్‌వాదీ పార్టీ నేత ఎంపీ రామశంకర్ రాజ్‌భర్ అన్నారు. ఆ దాడికి కారణమైన ఉగ్రవాదులను రోస్ట్ చేయాలని దేశ ప్రజలు కోరుకున్నట్టు తెలిపారు. అయితే ఆపరేషన్ సిందూర్‌లో ప్రభుత్వం సరైన రీతిలో చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు.

**మోడీ పహల్గాంకు ఎందుకు వెళ్లలేదు? : శివసేన**

త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌కు ప్రధాని మోడీ వెళ్లారని, కానీ ఉగ్రదాడి జరిగిన పహల్గాంకు మాత్రం ఎందుకు వెళ్లలేదని శివసేన ఎంపీ అరవింద్ సావంత్ ప్రశ్నించారు. అదే విధంగా ఇప్పటికీ మణిపూర్‌కు ఎందుకు వెళ్లలేదని అడిగారు.

**అమెరికా అధ్యక్షుడంటే ఎందుకు భయపడుతున్నారు? : టీఎంసీ**

ఆపరేషన్ సిందూర్ పట్ల అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, ఆ విషయాన్ని ఎందుకు ట్విట్టర్‌లో పోస్టు చేయడం లేదని ప్రధాని మోడీని టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడికి మీరెందుకు భయపడుతున్నార ని ప్రశ్నించారు. ఆర్‌జేడీ ఎంపీ అభరు కుమార్ సిన్హా మాట్లాడుతూ కాశ్మీర్‌లో భద్రతకు ప్రభుత్వం ఇచ్చిన హామీ, కుంభమేళాలో భద్రత, సరైన నిర్వహణకు ఇచ్చిన హామీని పోలి ఉందని ఎద్దేవా చేశారు.

## సంపాదకీయం

### ఐదు రోజుల్లో లక్ష కోట్లకు పైగా

# సంపద ఆవిరి



స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయి. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే మనం ఊహించలేం. మార్కెట్లపై సరైన అవగాహన ఉన్నప్పుడే.. ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రణాళికలు, పెట్టుబడి వ్యూహాలు, ఫలితాలు ఇలా ఇవన్నీ స్టాక్ గమనంతో పాటు స్టాక్ మార్కెట్ గమనాన్ని కూడా నిర్దేశిస్తుంటాయి. అందుకే జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇంకా సరైన సమయంలో సరైన కంపెనీ స్టాక్‌ను నిపుణుల సలహాతో ఎంచుకోవాలి. ఇదే సమయంలో షార్ట్ టర్మ్‌లోనే లాభాలు రావాలని కూర్చోవద్దు. ఓపిక ఉండాలి. దీర్ఘ కాలంలోనే బంపర్ రిటర్న్స్ వస్తుంటాయని నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు. అయితే గత కొంత కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. గత వారం షేర్ మార్కెట్లో గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ముఖ్యంగా సెన్సెక్స్ టాప్-10 జాబితాలోని పలు కంపెనీల పెట్టుబడిదారులు నష్టాలను చవిచూశారు. మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు టాటా గ్రూప్‌కు చెందిన టీసీఎస్, ఎల్ఐసీ వంటి సంస్థలకు గత వారం నిరాశజనకంగా ముగిసింది. అయితే ఈ పతనంలో రిలయన్స్ పెట్టుబడిదారులు అతిపెద్ద షాక్‌ను చవిచూశారు. కేవలం 5 పని దినాల్లో వారి సంపద రూ.లక్ష కోట్లకు పైగా తగ్గింది.వరుస సెషన్లలో పతనం దిశగానే సాగుతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడితో ఆయా షేర్లను విక్రయిస్తుండటం కారణంగా స్టాక్స్ పడిపోతుండటంతో పాటు వారు కూడా నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలకు తోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కఠిన నిర్ణయాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.ఇక గత వారం కూడా సూచీలు భారీగానే పడిపోయాయి. బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 294.64 పాయింట్లు పడిపోయింది. ఈ క్రమంలోనే చాలా స్టాక్స్ పడిపోగా.. దేశంలో మార్కెట్ విలువ పరంగా టాప్-10 కంపెనీల్లో 6 కంపెనీల విలువనే ఏకంగా రూ. 2.22 లక్షల కోట్లు తగ్గడం గమనార్హం. ఇందులో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్‌లో ఉంది. రిలయన్స్ సంస్థ ఎం- క్యాప్ 5 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1.14 లక్షల కోట్లు తగ్గగా ఇప్పుడు అది రూ. 18.83 లక్షల కోట్లకు దిగొచ్చింది.ఆ తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉంది. ఇన్ఫీ మార్కెట్ విలువ గత వారం రూ. 29 వేల కోట్లకుపైగా తగ్గగా ప్రస్తుతం ఎం - క్యాప్ రూ. 6.29 లక్షల కోట్లుగా ఉంది. ఇదే సమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. రూ. 23 వేల కోట్ల పతనంతో రూ. 5.60 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20 వేల కోట్లు తగ్గి రూ. 11.34 లక్షల కోట్లకు పడిపోయింది. బజాజ్ ఫినాన్స్ ఎం క్యాప్ రూ. 17 వేల కోట్లు తగ్గింది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 17 వేల కోట్లు పడిపోయింది.వీటికి భిన్నంగా మరో 4 కంపెనీల విలువ అమాంతం పెరిగింది. ఫలితాల్లో ఈ కంపెనీలు అంచనాల్ని మించగా.. షేర్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో నిలిచింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 37 వేల కోట్లు పెరిగి రూ. 15.38 లక్షల కోట్లకు ఎగబాకింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం క్యాప్ రూ. 35 వేల కోట్లు పెరగడంతో రూ. 10.53 లక్షల కోట్లుగా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 20 వేల కోట్లు పెరిగి రూ. 11.04 లక్షల కోట్ల వద్ద ఉంది. అంతకుముందు వారం ఇది మార్కెట్ విలువలో టీసీఎస్‌ను మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ తగ్గింది. ఎస్బీఐ ఎం - క్యాప్ రూ. 9 వేల కోట్లు పెరిగి రూ. 7.44 లక్షల కోట్లకు చేరింది.స్టాక్ మార్కెట్ లో వచ్చిన పతనం కారణంగా బే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని 30 షేర్ల సెన్సెక్స్ 294.64 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ పరిణామంలో సెన్సెక్స్ టాప్-10లో 6 కంపెనీల మార్కెట్ క్యాప్ సంయుక్తంగా రూ.2.22 లక్షల కోట్ల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. అయితే ఈ పతనంలో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ సహా నాలుగు సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ పెరిగి పెట్టుబడిదారులకు ఊరటనిచ్చింది.గత కొన్ని వారాలుగా దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ తగ్గినప్పటికీ ఇది ఇప్పటికీ దేశంలో అత్యంత విలువైన కంపనీల జాబితాలో నంబర్ 1 స్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దీని తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్ , బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ రిలయన్స్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

## కూటమి టార్గెట్ అంతా రాయలసీమే

**అనంతపురం - సూర్య వాస్తవం**

కడపలో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేక పోయింది. దాంతో మొన్నటి ఎన్నికల తర్వాత కూటమి కాన్సంట్రేషన్ ఓవర్ టు సీమ అయి పోయింది. వైసీపీని తిరిగి అక్కడ కోలుకోకుండా చేస్తే ఇంకో రెండు మూడు టర్మ్‌లు తమదే పవర్ అని అంచనా వేస్తోంది టీడీపీ. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మహానాడుకు కడపనే వేదికగా ఎంచుకుంది సైకిల్ పార్టీ. జగన్ కంచుకోటలో మూడురోజుల పాటు మహానాడు నిర్వహించి..ల క్షలాది మందితో సభ పెట్టి..జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో పసుపు మయం చేసి పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసే ప్రయత్నం చేసింది.తెలుగుదేశం పుట్టాక చాలా నగరాల్లో మహానాడు పెట్టారు. కానీ ఫస్ట్ టైమ్ హిస్టరీలో సాధించనన్ని సీట్లు సాధించిన తర్వాత కడపను టార్గెట్ చేస్తూ బ్రహ్మాండంగా పార్టీ పండుగను నిర్వహించి వైసీపీకి తన సత్తా ఏంటో చూపించింది టీడీపీ. సేమ్‌టైమ్ జనసేన పరంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వరుసగా కడప పర్యటనలు చేస్తూ..జగన్ అండ్ వైసీపీ నేతలకు వార్నింగ్‌లు ఇస్తూ వస్తున్నారు. ఇప్పుడు కూటమిలో మరో మిత్రపక్షం వంతు అన్నట్లుగా ఉంది. బీజేపీ కూడా కడప నుంచే తన కార్యాచరణకు రెడీ అవుతోంది. బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితుల్కైన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. వాటిని కడప నుంచే మొదలు పెడతామని ప్రకటించారు. కడపను రాజకీయ




కోణంలో కాకుండా ఆధ్యాత్మిక కోణంలో చూస్తున్నాం.. అందుకే కడపను ఎంచుకుంటున్నామని చెబుతున్నారు.దేవుని తొలి గడప కడప అని మాధవ్ చెప్పారు. అందుకే సారథ్యం పేరుతో రాష్ట్ర పర్యటన త్వరలోనే మొదలవుతుందని అంటున్నారు. తొలి శాసనం దొరికిన జిల్లాగా అలాగే తెలుగు జాతి తెలుగు సంస్కృతికి ప్రధాన ద్వారంగా నిలిచిన కడప నుంచి పర్యటన స్టార్ట్ చేస్తామంటున్నారు. ఐదు విడతలుగా సారథ్యం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొన సాగనుంది. ఉత్తరాంధ్రకు చెందిన మాధవ్.. అక్కడి నుంచే పార్టీ యాక్టివిటీస్‌ను మొదలెడతారని అంతా అనుకున్నారు. కానీ మాధవ్ తన తొలి రాష్ట్ర పర్య టనను రాయలసీమ నుంచి పైగా జగన్‌కు, వైసీపీకి హార్డ్ కోర్ జిల్లా అయిన కడప నుంచి ప్రారంభి స్తుండటం ఆసక్తికరంగా మారింది. కూటమి పార్టీలన్నీ తమ బలాన్ని పెంచుకోవడానికి కార్యక్షేత్రంగా కడపనే ఎంచుకుంటున్నాయి. పవన్ కూడా అనేక సార్లు రాయలసీమలో పర్యటిస్తూ వస్తున్నారు. కడపలో రచ్చబండ కార్యక్రమం పెట్టారు. ఆ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో విరీద జరిగిన దాడిని ఖండిరచి వచ్చారు పవన్. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతానంటూ ప్రకటిం చేశారు. రాయలసీమ విరీ జాగీరు కాదు.. గూండాగిరి చేస్తే ఊరుకు నేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్.కర్నూలు జిల్లాలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఇక కడపలో పర్యటించి..సజ్జల రామ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్నాయని ఆరో పిస్తున్న అటవీ భూములను పరిశీ లించారు. సీఎం చంద్రబాబు కూడా నెలలో కనీసం రెండు సార్లకు తక్కువ కాకుండా సీమ జిల్లాల టూర్లు వేస్తున్నారు. ఇప్పుడు బీజేపీ కూడా రాయలసీమపైనే ఫోకస్ పెడుతోంది. దాంతో వైసీపీ వర్సెస్ కూటమిగా రాయలసీమ రాజకీయం మారిపోయింది.తిరిగి తన పట్టును సాధించేందుకు.. గత వైభవం తెచ్చుకు నేందుకు వైసీపీ ప్లాన్ చేస్తోంది. మూడు కీలక పార్టీలు అంతా కలసి సీమ విరీద కన్ను వేయడంతో వైసీపీకి సవాల్‌గా మారింది. జగన్ కంచుకోట సెంట్రిక్‌గా కూటమి

## సర్దుకోలేకపోతున్నాం

**జనసేన ఎమ్మెల్యేల మనోవేదన**

**విజయవాడ- సూర్య వాస్తవం**

జనసేన ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారా? వారిలో ఫ్రస్టేషన్ పతాక స్థాయికి చేరుకుందా? టిడిపి తీరుపై ఆగ్రహంగా ఉన్నారా? కక్కలేక మింగలేక ఇబ్బంది పడుతున్నారా? ఎంతసేపు తమను సర్దుబాటు చేసుకోవాలన్న సూచనను వ్యతిరేకిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పైకి టిడిపితో సమన్వయం కొనసాగుతున్న.. లోలోపల మాత్రం జనసేన ఎమ్మెల్యేలు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి నేతల పెత్తనం కొనసాగుతుండడాన్ని వారు సహించలేకపోతున్నారు. అలాగని నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సర్దుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొందరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జులు అసంతృప్త స్వరం వినిపిస్తే వేటు వేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేలు సైతం వెనక్కి తగ్గుతున్నారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామి. 100శా విజయంతో.. డిప్యూటీ సీఎం గా పవన్.. మరో ఇద్దరు జనసేన మంత్రులు.. మరో ఇద్దరు ఎంపీలు.. 21 శాతం మంది ఎమ్మెల్యేలతో జనసేన పటిష్ట స్థితిలో కనిపిస్తోంది. అయితే రాజకీయంగా మైలేజ్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం నియోజక వర్గాల్లో ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ అంతా టిడిపి నేతల పెత్తనం ఎక్కువగా ఉన్నట్లు సమా చారం. పైగా అక్కడ టిడిపి నేతల మాటే చెల్లుబాటు అవుతోందని ప్రచారం నడుస్తోంది. ఆ పై టిడిపి



నియోజకవర్గ ఇన్చార్జి లకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. వారి మాటనే ప్రభుత్వంలో చెల్లుబాటు అవుతోంది. ఎమ్మెల్యేలు ఉన్నారంటే ఉన్నారు అన్నట్టు ఉంది జనసేన శాసన సభ్యుల పరిస్థితి. ఇది రోజు రోజుకు పతాక స్థాయికి చేరుకుంటుంది. దీనిపై జనసేన ఎమ్మెల్యేల్లోనే చర్చ నడుస్తోంది.వాస్తవానికి రాష్ట్రస్థాయిలో తప్పనిసరి పరిస్థితుల్లో పొత్తుకు అంగీకరించారు టిడిపి నేతలు. జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాలు టిడిపికి కంచుకోటలాంటివి. అక్కడ ఆ పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన నాయకులు సైతం ఉన్నారు. అటువంటివారు పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేశారు. ఇప్పుడు టిడిపి నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో సీట్లు త్యాగం చేసిన నేతలకు పదవులు దక్కాయి. పార్టీపరంగా ప్రాధాన్యం లభిస్తుంది. సీట్లు త్యాగం చేశారు కాబట్టి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యవర్గంలో సైతం చోటిస్తున్నారు. దీంతో వారు దూసుకుపోతున్నారు. సీనియర్లు కావడంతో అధికారులతో కూడా పనులు చేయించుకుంటున్నారు. వారితో చూసుకుంటే జనసేన ఎమ్మెల్యేల మాటలు కొన్నిచోట్ల చెల్లుబాటు కావడం లేదు. దీంతో వారికి అవమానాలు ఎదురవుతున్నాయి. అయితే ఒకటి కాదు రెండు కాదు దాదాపు జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి.జనసేన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ బాధను వ్యక్తం చేస్తే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదూ కుడును నియంత్రించాలంటే పొత్తు కొనసాగాలని.. అలా కొనసాగాలంటే సర్దుబాటు చేసుకోవాలని జనసేన ఎమ్మెల్యేలకు నాయకత్వం సూచిస్తోంది. దీంతో ఒక రకమైన అసంతృప్తి ఎమ్మెల్యేల్లో ఉంది. పవర్ లేని ఈ పదవులు ఎందుకని.. టిడిపి నేతల మాటలే చెల్లుబాటు అవుతుంటే ఇక తాము ఉండి ఏమి ప్రయోజనమని ఎక్కువమంది బాధపడుతున్నారు. మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే జనసేన ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తప్పకుండా ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు.

## ఇక సైనికులకు

# బాడీ కెమెరాలు


**శ్రీనగర్ - సూర్య వాస్తవం, జూలై 28**

సరిహద్దుల్లో చొరబాటుదారుల ఆగడాలకు కేంద్రం టెక్నాలజీతో చెక్ పెట్టబోతోంది. జవాన్లకు బాడీ కెమెరాలు అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. భారత్ సరిహద్దుల్లోకి వచ్చిన అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో సాయుధ బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో సహా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. దాంతో.. బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కార్యకలాపాలను మరింత మెరుగు పరిచేందుకు అధునాతన బాడీ-వోర్న్ కెమెరాలను సమకూర్చుకుంటోంది. ఈ కెమెరాలు జవాన్ల యూనిఫామ్‌లకు అమర్చబడి, సరిహద్దుల్లో జరిగే ప్రతి అంశాన్ని రికార్డు చేస్తాయి. దానిలో భాగంగానే.. భారత్-బంగ్లాదేశ్, పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.ముఖ్యంగా.. బంగ్లాదేశ్, పాక్ సరిహద్దుల వెంట విధులు నిర్వర్తిస్తున్న ఖాఈ దళాలకు ఆయా బాడీ కెమెరాలను అందించనుంది. ఇప్పటికే 2,500 కెమెరాలను పంపిణీ చేయగా, మరో 2,500 కెమెరాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు ఎంపిక చేసిన సరిహద్దు ఔట్ పోస్టుల్లోని సిబ్బందికి ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్ వంటి బయోమెట్రిక్ పరికరాలను అందించనున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు అందజేయనుంది.బీఎస్ఎఫ్ ప్రతిపాదించిన ఈ రెండు విధానపర నిర్ణయాలపై సమగ్ర సమీక్ష తర్వాత కేంద్ర హోంశాఖ ఇటీవల ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే.. రెండు దశల్లో వీటిని భారత్-బంగ్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్‌కు అందజేస్తుంది. రాత్రిపూట చిత్రీకరణ, 12-14 గంటల ఫుటేజీ నిక్షిప్తం చేసుకునే సామర్థ్యం ఈ కెమెరాలకు ఉండనుంది.

## వైసీపీ నేత ఓవర్ టూ ఢిల్లీయేనా...

**విజయవాడ - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో వరసగా అరెస్ట్ లు జరుగుతుండటంతో పాటు తనకు అత్యంత ఆప్తులైన వారిని జైల్లోకి పంపుతుండటంతో వైఎస్ జగన్ ముఖ్యమైన నిర్ణయం వైపుగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో పన్నెండు మంది అరెస్టయ్యారు. అందులో తన కార్యాలయంలో పనిచేసిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు తనకు అత్యంత ఆప్తులైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ కావడంతో మనస్తాపం చెందిన వైఎస్ జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. అందులో ఒక ప్రచారానికి వస్తే త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ నేతలను కలసి ఏపీ లిక్కర్ స్కామ్ విషయంపై చర్చిస్తారంటున్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని, తాను అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో 2019 నుంచి 2024 వరకూ వచ్చిన ఎక్సైజ్ ఆదాయంపై బీజేపీ నేతలకు వివరించే అవకాశముందని ప్రచారం జరుగుతుంది. అయితే



జగన్ ఇప్పట్లో ఢిల్లీ వెళ్లే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీకి వెళ్లి ఎవరినీ కలిసే ఉద్దేశ్యం లేదని, మద్యం కేసును న్యాయపరంగానే ఎదుర్కొనేందుకు జగన్ సిద్ధమవుతున్నారని అంటున్నారు. దీంతో పాటు మరో ముఖ్యమైన ప్రచారం జరుగుతుంది. వైసీపీ నేతలపై అక్రమ కేసులు, అరెస్ట్ లకు నిరసనగా వైసీపీ శాసనసభ్యులందరితోనూ రాజీనామా చేయిస్తారన్న ప్రచారం జరుగుతుంది. తనతో పాటు గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలందరి చేత రాజీనామా చేయించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున కథనాలు వెలువడుతున్నాయి. అయితే గతంలో మాదిరిగా ఇప్పుడు రాజీనామాల అస్త్రాల ప్రయోగం జగన్ చేయరన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. గెలిచిన నియోజకవర్గాల నుంచి రాజీనామాలు చేసి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ప్రజలలో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడుతుందని భావిస్తున్నారు. నాడు సెంటిమెంట్ కారణంగా రాజీనామాలు చేస్తే వర్కవుట్ అయ్యాయి. కానీ ఇప్పుడు అరెస్ట్ లను సాకుగా చూపి రాజీనామాలు చేయించినంత మాత్రాన జరిగేదేమీ లేదన్న విషయం జగన్ కు తెలియంది కాదు. ఉప ఎన్నికల్లో ఈసారి గెలుపు కూడా కష్టమే అవుతుంది. సెంటిమెంట్ లేకపోగా, సానుభూతి రాకపోగా అసలుకే ఎసరు వచ్చి ప్రస్తుతం పార్టీకి ఉన్న హైప్ కూడా పోతుందని ఆయన గట్టిగా భావిస్తున్నారు. అందుకే కేసులకు భయపడి ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి సాగిలపడటం, అలాగే ఉన్న ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించడం జరగదని వైసీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు చెప్పారు. అవన్నీ ప్రచారం మాత్రమేనని, వాస్తవానికి దూరంగా అటువంటి విశ్లేషణలు ఉన్నాయని చెబుతున్నారు.

# అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత చంద్రబాబుది

## - మేయర్ మహమ్మద్ వసీం



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, జూలై 28:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేసిందని రీ కాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంలో భాగంగాతాము ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు చంద్రబాబు మాటలు విని మోసపోయామని ప్రజలు చెపుతుండటమే నిదర్శనమని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 38,39వ డివిజన్‌ల పరిధిలో నిర్వహిస్తున్న రీకాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం వైసీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం,గత వైసీపీ ప్రభుత్వంలో అమలు అయిన సంక్షేమ పథకాలను రద్దు చేయడం వల్ల ఆయా కుటుంబాలు ఎంత నష్టపోయింది క్యూ ఆర్ కోడ్ ద్వారా వివరించారు.అనంతరం మేయర్ మహమ్మద్ వసీం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కంటే రెట్టింపు సంక్షేమం అందిస్తామని హామీ ఇస్తే ఓట్లు వెస్తామని రెట్టింపు ఇవ్వకపోగా ఉన్న పథకాలే రద్దు చేశారని ప్రజలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.గతంలో వైసీపీ పాలనలో సంక్షేమ క్యాలెండర్ ఇచ్చి వాటి మేరకు ప్రతి నెలా ఏదో ఒక పథకం అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు.నేడు పింఛన్లు,అరకొరగా తల్లికి వందనం ఇచ్చినా సుపరి పాలన అంటూ ప్రజల



వద్దకు వెళ్తూ అసత్య ప్రచారాలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు.వైసీపీ హయాంలో 38వ డివిజన్ పరిధిలో రూ.2.5 కోట్లు,39వ డివిజన్ పరిధిలో రూ.3కోట్లతో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజీల అభిరుద్ధి చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు,మైనార్టీ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ ఖాజా,వైసీపీ నాయకులు ఏ1రఫీ, నాగరాజు, రియాజ్, పద్మావతి, నందిని, హిదయతుల్లా, సురేష్, పెద్దన్న, కాకర్ల శీనా, నాగార్జున, హరి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 28:** హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మదనపల్లె ఏడవ అదనపు జిల్లా కోర్ట్ శ్రీలత సోమవారం సంచలన తీర్పు చెప్పారు. ఇందుకు సంభందించి పుంగనూరు సీఐ సుబ్బా రాయుడు, మదనపల్లె ఏపీపి జయ నారాయణరెడ్డి లు తెలిపిన వివరాల మేరకు. చిత్తూరు జిల్లా, పుంగనూరు పట్టణం, నక్క బండకు చెందిన తోటి రాజేష్ అలియాస్ రాజా(26), అదే ఊరికి చెందిన ఫరూక్ ఇద్దరు కలసి అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించారు. దీంతో ఇరువురు ఆ అమ్మాయి కోసం 2022లో కొట్టు కున్నారు. ఈ ఘర్షణలో రాజేష్ తన వద్ద ఉన్న కత్తితో ఫరూక్‌ను పొడిచి హత్యా యత్నానికి పాల్పడడంతో అప్పటి ఎస్ఐ నిందితుడు రాజేష్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపాడు. ఈ కేసును మదనపల్లె 7త్ ఏడిజే కోర్టు పూర్వాపరాలని విచారించి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో జడ్జి పదేళ్ల జైలు శిక్ష, రూ.30,000 వేల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు సులభంగా అందజేయాలి

## - ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 28:** అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కవులు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.రంగారెడ్డి రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాథ నాయుడు డాక్టర్ కెవిఎస్ నాయుడు రంజాన్ అలీ ఖాన్ రామాపురం మండలం అధ్యక్ష కార్యదర్శులు నవీన్ కుమార్ రెడ్డి షబ్బీర్ భాష ఆఫీస్ వీరి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ వినతిపత్రంలో పొందుపరిచినటువంటి కపుల్ రైతుల డిమాండ్ కౌన్ రైతులకు సులభంగా గుర్తింపు కార్డు జారీ చేయాలని అదేవిధంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తుంది కవులు రైతులకు కవుల గుర్తింపు కార్డు కొంతమందికి మాత్రమే ఉంది మరి కొంతమందికి లేదు ఈ అన్ని గుర్తించి ఎంతమందికి గుర్తింపు కార్డు అందజేశాము ఎంతమందికి మనం ఇవ్వాలా అని రెవెన్యూ అధికారులు దీనిపైన గుర్తించి మరి అందరికీ మేలు జరిగే విధంగా అందజేయాలని ఈ సమావేశంలో ముఖ్యంగా ఈరోజు సోమవారం స్పందన కనుక గ్రామాల సర్పంచులు అందరితో రాయచోటి తహశీల్దార్ మీటింగ్ సమయంలో వీఆర్వో అందరి సమక్షంలో రైతు సంఘాలు కబుర్ రైతుల సమస్యలు ఎన్ని ఉన్నా కూడా వారిని అందరిని సంప్రదించి మీకు అవగాహన లేని వారు ఎవరు ఉంటే మీరు రైతు సంఘాల్లో కూడా వారి సలహాలు పాటించి కబురు రైతులకు న్యాయం చేయాలని రాయచోటి తాసిల్దార్ గారు ఈ సమావేశంలో తెలియజేశారు ఈ సమావేశంలో కపుల్ రైతుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి ఈ డిమాండ్లను అతివేగంగా పరిష్కారం చేయాలని ఈ కవులు రైతుల డిమాండ్లు ఒకటి కవులు రైతుల రచన సంక్షేమ కోసం సమగ్రహమైన కవులు చట్టాన్ని తక్షణమే తీసుకోవాలి 2 గ్రామ సభలోని నేరుగా కవులు రైతులను గుర్తించి గుర్తింపు కార్డు జారీ చేయాలని ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు వస్తే వ్యవసాయం ఉద్యాన రెవెన్యూ అధికారుల సంయుక్తంగా పంట పొలాలను పరిశీలించి చుట్టుపక్కల రైతులను కూడా కట్టుకొని విచారించి కార్డులు ఇవ్వాలి. మూడు దేవాలయ ధర్మాదాయ మరియు వర్ఫ్ భూములు వివిధ రాష్ట్ర భూములను గుర్తు చేసుకుంటూ వారికి కవుల అగ్రిమెంట్ ప్రకారము గుర్తించు కార్డు జారీచేయలే గుర్తింపు కార్డు పొందిన ప్రతి ఒక్క కపుల్ రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ఇన్సూరెన్స్ ఇంకోటి సబ్సిడీ అన్నీ కూడా రైతుల మాదిరిగా కబురు రైతులకు కూడా వర్తించే విధంగా ఈ కబురు రైతులను గుర్తించాలి ఈ కవులు రైతులు పండిస్తున్నటువంటి పంటలకు ఉచిత భీమా అందజేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకొని కవులు రైతులకు న్యాయం చేసే విధంగా ఆలోచించాలని ఈ కార్యక్రమం రాయచోట్లో చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి రాయచోటి తహశీల్దార్ సానుకూలంగా స్పందించి తగిన న్యాయం చేసే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు.

# బాబూ కాలనీలో పోలీసుల కార్డెన్ సర్చ్..

## - 18 రికార్డులు లేని వాహనాలు సీజ్...





**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 28:** అన్నమయ్యా జిల్లాలోని మదనపల్లె బాబూ కాలనీలో సోమవారం వేకువ జామున పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో డిఎస్పీ మహీంద్ర డివిజన్‌లోని సీఐ, ఎస్ఐలు, పోలీస్, ఎస్టియఫ్ బృందాలతో ఇళ్లిళ్లు గాలించి తనిఖీలు జరిపారు. బయట వ్యక్తులు, అనుమానితులు, రికార్డులు లేని వాహనాలను పెద్ద ఎత్తున పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ. సారా, గంజాయి ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీస్ బృందాలతో కార్డెన్ సర్చ్ నిర్వహించామని డిఎస్పీ తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో మొత్తం 17 ద్విచక్ర వాహనాలు ఒక ఆటోకు రికార్డులు లేని కారణంగా సీట్ చేయడం జరిగిందని చెప్పారు. కాటన్ సెర్చ్ లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల సిఐలు ఎస్ఐలు పోలీసులు పాల్గొన్నారని డిఎస్పీ చెప్పారు.

# జిల్లా పోలీసు గ్రీవెన్స్ కార్యక్రమానికి 87 వినతులు



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 28:** జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ““ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ .తమకు జరిగిన అన్యా యానికి న్యాయం కోసం సామాన్య ప్రజలు పోలీసు వారిని ఆశ్రయిస్తారని... సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో విచారణ జరిపి, పూర్తిస్థాయి పరిష్కారం జరిగేలా చూడాలని జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులను జిల్లాఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్ర మానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీక రించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, తదితర సమ స్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకున్నారు. వారి సమ స్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపాలని సూచించిన జిల్లా ఎస్పీ .ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు మహిళా విభాగం డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారిణికి కృత్రిమ కుడి చెయ్యి అమరిక

## - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 28:** జన్మతః కుడి చేయి లేకుండా జన్మించిన జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మదనపల్లి ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి హెచ్. శివాని, పారా అథ్లెటిక్ క్రీడాకారిణికి కృత్రిమ కుడి చెయ్యి అమర్చినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామ కూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అభినంద నీయమైన మానవీయమైన చర్యకు శ్రీకారం చుట్టారు. జన్మతః కుడి చేయి లేకుండా జన్మించిన జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మదనపల్లి ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి హెచ్. శివాని పారా అథ్లెటిక్ క్రీడాకారిణికి కృత్రిమ కుడి చెయ్యి అమరిక ఏర్పాటుకు చర్యలు తీసు కున్నారు. ఈమె దివ్యాంగుల కేటగిరీ పోటీలలో షాట్‌పుట్ మరియు జావెలిన్ త్రోలలో జాతీయ స్థాయి పారా అథ్లెట్ గా, థాయి లాండ్, బెంగళూరు, గుజరాత్ వంటి దేశీయ-అంతర్జాతీయ వేదికలపై పోటీపడి మూడు బంగారు పతకాలు సాధించి గర్వించదగిన క్రీడాకారిణి హెచ్. శివాని అన్నారు. ప్రతి ప్రతిభావంతుడికి అవసరమైన వనరులు అందించడం మన బాధ్యతని కలెక్టర్ తెలిపారు.

శివాని చదువులో, క్రీడలలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గతంలో కుమారి హెచ్. శివాని "కృత్రిమ చేయి" ఏర్పాటు కొరకు జిల్లా కలెక్టర్ గారిని అభ్యర్థించగా, కలెక్టర్ వెంటనే స్పందించి రూ.21,000 మంజూరు చేయగా, డిస్ట్రిక్ట్ డిసెబిలిటి రిహాబిలిటేషన్ సెంటర్ (డీడీఆర్‌సీ), కడప ,దాని అమలు సంస్థ దర్శిని హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.39,000తో అదనపు సహకారం అందించారన్నారు. కృత్రిమ చేయి అందించే ప్రక్రియను విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమర్థవంతంగా పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. కుమారి శివాని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దాతృత్వంతో చేసిన ఈ సహాయం వల్ల నా చదువు, క్రీడా జీవితాన్ని సమన్వయం చేసుకొని మరింత మెరుగ్గా రాణించడానికి వీలవుతుందని తెలియచేస్తూ, అడిగిన వెంటనే స్పందించి మరిచిపోలేని సహాయం అందించిన జిల్లా కలెక్టర్‌కు అధికారులకు, సంస్థలకు తన మనస్ఫూర్వకమైన కృతజ్ఞతలు తెలియచేశారు.

## చంద్రబాబు మోసాలు ప్రజలకు శాపాలు

- రాయచోటి పట్టణంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ
- చంద్రబాబూస్ రీకాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీకాంత్ రెడ్డి





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, జులై 28:** చంద్రబాబు మోసాలు ప్రజలకు శాపాలుగా మారాయని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి మున్సిపల్ పరిధి లోని కొత్తపల్లె ప్రాంతంలోని వార్డులలోని నూరాని మసీదు, మహమ్మద్ పురా మసీదు, బడీకరీమియా మసీదు ప్రాంతాల వీధులలో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ– చంద్రబాబూస్ రీకాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష,వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, పట్టణ అధ్యక్షుడు నవాజ్, స్థానిక కౌన్సిలర్లు ఇర్ఫాన్, రౌనక్ ,నాయకులు తో కలసి పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయా వీధులలో శ్రీకాంత్ రెడ్డి పర్యటించి ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగట్టారు.రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో.. చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెచ్చారు. బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల మొబైల్ ఫోన్‌లలో క్యూ ఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేయించి, స్కాన్ చేపించి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూఎన్నికల్లో ప్రజలను మోసగిం చేందుకు ఇచ్చిన హామీలైన అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు వివరించాలన్నారు.

**ఉల్లాసంగా..ఉత్సాహంగా కొనసాగిన శ్రీకాంత్ రెడ్డి పర్యటన**

మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పర్యటించిన కొత్తపల్లె ప్రాంతంలోని వీధులలో ప్రతి ఇంటిలో కొత్త ఉత్సాహం కనిపించింది. రాయచోటిని జిల్లా కేంద్రం చేసి, పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసిన నాయకుడిని తిరిగి కలిసిన ఆనందం, కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలు, యువత, మహిళలు, వృద్ధులు వర్గ భేదం లేకుండా అందరూ శ్రీకాంత్ రెడ్డి ని ఆత్మీయంగా పలకరించారు. అచ్చా ఆద్మీ జగనన్న అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సిపి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలును , పట్టణం లో వంద పడకల ఆసుపత్రి, ఆర్ టి సి బస్ స్టాండ్ విస్తరణ, మున్సిపల్ సభా భవనం, డైట్ మున్సిపల్ పార్క్,రైతు బజార్, నగర వనం, పాఠశాలల అభివృద్ధి, ఉర్దూ మీడియంతో కూడిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పట్టణంలో రహదారుల అభివృద్ధి, ఠానా– చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు సర్కిల్ వరకు నాలుగు వరుసల రహదారి అభివృద్ధి, గుణ్ణికుంట్ల రోడ్ తదితర అభివృద్ధి పనులును, స్టేడియం, పట్టణ పేదల కోసం 6 వేల మందికి నారాయణ రెడ్డి పల్లె వద్ద జగనన్న కాలనీలో పక్కా గృహాలు మంజూరు తదితర అభివృద్ధి పనులు జరిగాయని శ్రీకాంత్ రెడ్డి ఎదుట మైనారిటీ ప్రజలు గుర్తుకు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొలిమి హారూన్ బాష, జాఫర్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు జాకీర్, , కౌన్సిలర్లు కొలిమి ఛాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, సాదక్ అలీ, షబ్బీర్, గౌస్ ఖాన్, ఆల్తాఫ్,జాఫర్ అలీ ఖాన్, అన్నా సలీం, అబుజర్, రియాజుర్ రెహమాన్,తాజ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, శశిధర్ రెడ్డి, సుగ వాసి శ్యామ్, నియోజక వర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు జానం రవీంద్ర యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, రోటరీ హుసేన్, నవాజ్ క్రిష్, అమీర్, ఇనాముల్లా,ఖాదర్ వలీ, ఖలీల్, అజ్మతుల్లా ఖాన్,కో ఆష్పన్ ఖాదర్ వలీ, ఫైరోజ్, సాధక్ అలీ, అంజాద్ అలీ, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాలంకరణలో భోగేశ్వరుడు



**పామిడి – సూర్యవాస్తవం, జూలై 28:** పామిడి పట్టణంలోని పురాతన భోగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి సోమవారం అందులో నాగుల చవితి కావడంతో భక్తాదులతో దేవాలయం కిక్కిరిసిపోయినది. పురోహితులు రాము స్వామి, జయచంద్ర, స్వామి, అనిల్ కుమార్ స్వాములచే వినాయక నవగ్రహ ప్రసన్న పార్వతిదేవికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. మూల విరాట్ అయిన భోగేశ్వర స్వామికి సర్వాభిషేకములు అర్చనలు మహా మంగళారతి ఇచ్చి బక్తాదులకు దర్శనం కల్పించారు. వచ్చిన భక్తాదులు అందరికీ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెట్టుబడుల కోసమే సీఎం సింగపూర్ పర్యటన

- రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి.. శరవేగంగా అభివృద్ధి చెందుతోంది
- ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే దురుద్దేశంతో పెట్టుబడులు రాకుండా చేసేందుకు జగన్ రెడ్డి కుట్రలు
- రాష్ట్రానికి వస్తున్న కంపెనీలపైన కూడా వైసీపీ నేతలు బురద జల్లుతున్నారు
- రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి – సూర్య వాస్తవం, జూలై 28:** ఐదేళ్ల రాష్ట్రాన్ని దోచుకొని పారిశ్రామికీకరణ అనే పదమే రాష్ట్రంలో వినపడకుండా చేసి ప్రజల జీవనో పాధిని వైసీపీ నేతలు దెబ్బ తీశారని పేదల భూములు దోచుకోవడానికే మీరు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొస్తేమేము అంతర్జాతీయ కంపెనీల తీసు కొచ్చి యువతకు ఉపాధిఅంది స్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల విశ్వాసం, నమ్మకం కల్పించి రాష్ట్రానికి సీబిఎన్ పరిశ్రమలు తెస్తుంటే వైసీపీ భవిష్యత్ చీకటిమయం అవుతుందనే భయం తో తాడే పల్లి ప్యాలెస్ నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతు న్నారని,రాష్ట్రానికిపరిశ్రమలువస్తున్నాయి, శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతు న్నాయనే దురుద్దేశంతో పెట్టు బడులు రాకుండా చేసేందుకు జగన్ రెడ్డి కుట్రలు పన్నుతు న్నాడని ఆపరేటర్లు తెలిపారు. ఆర్థికంగా దివాళా తీసిన రాష్ట్రాన్ని కాపాడేందుకు పరిశ్రమలను ఆకర్షించడానికి ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పారిశ్రా మిక, ఎంఎస్ఎంఈ, ఎలక్ట్రా నిక్స్ వంటి పాలసీలను తీసుకువచ్చి భూమి, విద్యుత్ వంటి రాయితీలను ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి తెలిపారు. దాంతో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, రెన్యూ, మిట్టల్, ఎన్ఎస్ఆర్ వంటి ఎన్నో కంపెనీలు రాష్ట్రంలో రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్ట నున్నాయి.నాడు మీరుతెచ్చిన పరిశ్రమలు ఏంటయ్యా అంటే బొబ్బట్లు, అప్పడాలు మొదల గు చిరుబండరాల పరిశ్రమలు తెచ్చామని నిస్సిగ్గుగాచెప్పుకు న్నారని విమర్శించారు. అంత ర్జాతీయ స్థాయిలో పేరొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్,హెచ్సీఎల్, ఐబిఎం, ఫిన్ టెక్, హెచ్ఎస్బీసి, ట్రైటాన్స్, లులూ గ్రూప్, బిఆర్ షెట్టి గ్రూప్, ఎపీపీపేపర్పరిశ్రమ, 17 కియా అనుబంధ సంస్థలు, అశోక్ లేల్యాండ్, అమర్ రాజా బ్యాటరీస్ మొదలగు కంపెనీలను తరిమేశారని ఆ ప్రకటనలో గుర్తు చేశారు .పెట్టుబడులు ఎంతోచ్చాయి అంటే "ఇప్పుడే పెట్ట గుడ్డు పెట్టింది. పొదగడా నికి సమయం పడుతుంది" అంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేసి వైసీపీ నేతలు నేడు అభివృద్ధిని అడ్డుకునే పనిలో ఉన్నారని తెలియజేశారు. రాష్ట్రానికి వస్తున్న కంపెనీ లపైన కూడా వైసీపీ నేతలు బురద జల్లుతు న్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థల మినహా మరే ఇతర సంస్థలకు మేము ఎకరా రూ. 99 పైసలకే ఇవ్వలేదు. కంపెనీ లకు భూకేటాయింపు లపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం ఉర్సా డేటా సెంట ర్కు ఎకరా రూ.55 లక్షలు, ఐటీ ఆఫీస్కు ఎకరా రూ.కోటి చొప్పున భూకేటాయించాం. 2014–19 మధ్య కూడా అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా, యూకే, దావోస్, జపాన్ వంటి దేశాల్లో పర్యటించి రూ. 65,327 కోట్ల విదేశీ పెట్టుబడు లను తీసుకువచ్చి 14.7 శాతం వాటాతో ఎఫ్ఐల్లో దేశంలోనే రెండో స్థానంగా ఏపీని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలిపారని మంత్రి తెలిపారు. ఐదేళ్ల జగన్ రెడ్డి అసమర్థపాలనవలనఎఫ్ఐల్లో దేశంలో ముందుండాల్సిన రాష్ట్రం రూ.6,808.20 కోట్లతో అట్టడుగుకు చేరింది.కోర్టు పర్మిషన్ తీసుకొని మరీ సతి సమేతంగా ప్రత్యేక విమానంలో దావోస్ పర్యటనకు పెట్టుబడుల కోసం అని చెప్పి ప్రజా ధనంతో జగన్ రెడ్డి ఫ్యామిలీ టూర్ వేశాడని ఆయన గుర్తుచేశారు.దావోస్, జర్మనీ, అమెరికా వంటిదేశాల్లో పర్యటనలు చేసి ఒక్క కంపెనీ, పెట్టుబడులు తీసుకురాకుండా అవి కేవలం ఫొటో షూట్లు, మీడియాప్రచారాలకుమాత్రమే పరిమితం చేశారని తెలిపారు.

**పెట్టుబడుల కోసమే సీఎం సింగపూర్ పర్యటన:** పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జా తీయ స్థాయిలో ఏపీ ప్రతిష్టత ను పెంచడమే ప్రధానఅజెండా. ఫిన్టెక్, డిజిటల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో ప్రపంచం లో ముందున్న కంపెనీలను రాష్ట్రానికితీసుకురావాడమే లక్ష్యం.రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనువైన వాతావరణాన్ని, వనరులను గురించి పారిశ్రామికవేత్తలకు వివరించేందుకు. ఒకసారి దావోస్లో ని వరల్డ్ ఎకనామిక్ ఫారంకు హాజరై అనేక దిగ్గజ కంపెనీలతో ప్రత్యేక సమావేశామయ్యారని తెలిపారు. ఆర్సెలార్ మిట్టల్, హెచ్ఎంఈఎల్, రెన్యూ పవర్, గూగుల్ క్లౌడ్, పెట్రోనస్, సిస్కో వంటి కంపెనీలు సీఎం దావోస్ పర్యటన ఫలితాలే.జగన్ రెడ్డిలా విదేశాలకు వెళ్ళేది పబ్లిసిటీకోసమో,వ్యాపారాలను చక్కదిద్దుకోవడం కోసమో కాదు.పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్ర ప్రగతిని ప్రపంచానికి మరోసారి చాటి చెప్పడం కోసమే చంద్రబాబు సింగపూర్ పర్యటన ఉద్దేశంమని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

# ఏనుగుల బారి నుండి రైతులను రక్షించండి....!

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం, జూలై 28:** గత కొంత కాలంగా ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయని, వీటి బారి నుండి ప్రజలను, ప్రత్యేకించి రైతులను కాపాడాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆహారం,నీటి కొరత, గుంపుల మధ్య పోరాటం తదితర కారణాల వల్ల ఏనుగులు అడవులు వదిలి సమీపంలోని గ్రామాల్లోకి వచ్చి పంట పొలాలను తిని, త్రొక్కి నాశనం చేయడమే కాకుండా రైతులను తొక్కి చంపుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 జనవరి 18న చంద్రగిరి మండలం, కందుల వారి పల్లె ఉప సర్పంచ్ ,టిడిపి నాయకులు రమేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపాయి. 2025 ఏప్రిల్ 25 న చిన్న గొట్టి గల్లు మండలం చిట్టే చర్ల గ్రామానికి చెందిన సిద్దయ్యను తొక్కి చంపాయి. ఈ నెల 26వ తేదీ శనివారం చిత్తూరు జిల్లా, సోమల మండలం,దిగువ కొత్తూరు గ్రామానికి చెందిన రామ కృష్ణ రాజు అనే రైతును పొలం వద్ద ఏనుగులు తొక్కి చంపాయి. చిత్తూరు, అన్నమయ్య, విజయ నగరం జిల్లాలలో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయి. ఇటీవలి కాలంలోనే దాదాపు 30 మంది చనిపోయారు. 300 ఎకరాలలో పంట ధ్వంసమైంది. రైతులకు కంటి మీద కునుకు లేదు. కర్ణాటకకు పోయి పవన్ కల్యాణ్ తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో తెలియడం లేదు. స్వర్ణాంధ్ర, వికసిత ఆంధ్ర సంగతి దేవుడెరుగు, ముందు ఏనుగుల బారి నుండి రైతులను,ప్రజలను కాపాడాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ బడుల మూత**

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విద్యా విధానాల వల్ల అనేక ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడుతున్నాయి. ఒక్క కడప జిల్లాలోనే ఈ సంవత్సరం 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూత బడ్డాయి. ఒక్క వేంపల్లి మండలంలోనే ముసల్ రెడ్డి పల్లె, కత్తులూరు, అయ్యవారి పల్లి, నాగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూత బడ్డాయి. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం జిల్లాలో 1వ తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 2,530 తగ్గింది. 6వ తరగతి లో 2091 తగ్గింది. దీనివలన పేదలు తమ బిడ్డలను ప్రైవేట్ బడులకు పంపాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.వంట ఏజెన్సీలు ఉపాధి కోల్పోయినాయి. ప్రభుత్వ పాఠశాలలు మూత పడకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**కడప స్టీల్ ప్లాంట్**

జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ప్రైవేట్ రంగంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయం. విభజన చట్టం ప్రకారం సెయిల్ ఆధ్వర్యం లో ఉక్కు పరిశ్రమ కడప జిల్లాలో ఏర్పాటు కావాలి.10 సంవత్సరాలు దాటినాఅతీగతీ లేదు. మోడీ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యం లోకడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం



**కుప్పం – సూర్య వాస్తవం, జూలై 28 :** కుప్పం పట్టణంలోని స్మశాన వాటికను సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. అధునాతన సౌకర్యాలతో కూడిన స్మశాన వాటిక నిర్మాణానికి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీతో పాటు కడ పీడి వికాస్ మర్మత్ ఈ భూమి పూజ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్విరామంగా శ్రమిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించి, కుప్పం పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిది ద్దడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో 22 కోట్ల రూపాయలతో నందమూరి తారక రామారావు క్రీడా సముదాయ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగి oదన్నారు. అలాగే అధునాతన స్మశాన వాటిక నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలను వెచ్చించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 2025 కల్లా పనులను పూర్తి చేసి, స్మశాన వాటికను ప్రజలకు అందుబాటులోనికి తీసుకువ స్తామ న్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జీలు కన్నన్, సోమశేఖర్, కౌన్సిలర్లు, తెలుగు మహిళలు, పలువురు నాయకులు పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ సుధీర్, గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బాలిక అదృశ్యం



**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 28:** అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన సాకే లక్ష్మినారాయణ కూతురుసాకే అంకిత (16) ఈనెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అమ్మాయి పదవ తరగతి చదువుతోంది. అమ్మాయి కనిపించకపోవడంతో బంధువులు చుట్టుపక్కల విచారణ చేసినా ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అమ్మాయి ఆచూకీ తెలిసిన వాళ్లు ఇటుకలపల్లి సర్కిల్ 9440796807 ఇటుకలపల్లి ఎస్ఐ నెంబర్ 9490106738 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలన్నారు.

## కార్యకర్త తండ్రి మృతికి టీడీపీ యువనేత నివాళి



**రాయచోటి-సూర్య వాస్తవం, జులై 28:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని సంజీవ్ నగర్ కాలనీ 16వ వార్డుకు చెందిన ప్రముఖ టిడిపి కార్యకర్త కిరణ్ కుమార్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో వెంకటేష్ భౌతిక కాయానికి సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతిచెందిన వెంకటేష్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## భూసార పరీక్షలు చేయించుకోండి



**రాప్తాడు - సూర్య వాస్తవం, జులై 28:** రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆత్మ పిడి పద్మలత తెలియజేశారు. రాప్తాడు మండల పరిధిలోని హంపాపురం గ్రామం నందు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా పిడి పద్మలత మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలను ఆధారంగా ఎరువుల వాడకం వలన రైతులకు ఎరువుల పై వచ్చే అధిక పెట్టుబడి తగ్గించుకోవచ్చని అన్నారు. భూమికి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు. జీవన ఎరువులు అయిన ట్రైకోడెర్మ విరిడి మరియు సుడోమోనస్ ఎరువులు విరివిగా వాడాలని అన్నారు. వేరుశనగ పంటలలో జొన్న మొక్క జొన్న పంటలను కంచె పంటలుగా వేయడం వలన పంటలకు ఆశించే చీడ పీడల ఉధృతి తగ్గుతుంది. దీని వలన పురుగు మందుల వాడకం తగ్గించవచ్చని తెలిపారు. ఖరీఫ్ కు సంబంధించి వివిధ పంటల బీమా గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య ఏఈఓ రంజిత రాణి సుజిత విహెచ్ఏ పావని ఎంపీఈఓ రాధ డి ఆర్ సి జిల్లా సిబ్బంది రైతు సేవ కేంద్రం అధికారులు సచివాలయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షులు పర్యటనను విజయవంతం చేద్దాం


**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, జూలై 28:** ఈనెల 29వ తేదీన అనగా మంగళవారం రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కర్నూలు జిల్లా రానున్న సందర్భంగా అతను పర్యటనను విజయవంతం చేయాలని కర్నూలు బిజెపి జిల్లా అధ్యక్షులు అక్కమతోట రామకృష్ణ, కోడుమురు నియోజకవర్గ కన్వీనర్ మీసాల ప్రేమ్ కుమార్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం కోడుమూరు నియోజకవర్గంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో అన్ని మండలాల అధ్యక్షులు ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ 29 వ తారీకు మంగళవారం నాడు మొట్టమొదటిసారిగా జిల్లా పర్యటన సందర్భంగా సమావేశాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు అక్కమతోట రామకృష్ణ వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేదల్చారు అందులో భాగంగా ఈరోజు కోడుమూరులో సన్నాహక సమావేశాన్ని నిర్వహించి సమావేశాన్ని జయప్రదం చేయుటకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. సమావేశనతరం ప్రధాని నరేంద్ర మోదీ 124వ మాన్‌కీ బాత్ కార్యక్రమం 150 మందితో నిర్వహిం చడమైనది. ఈ సమావేశం లో కోడుమూరు నియోజకవర్గ కన్వీనర్ మీసాల ప్రేమ్ కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వినుషా గారు ఏర్పాటు చేయగా సమావేశానికి జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలంకి రామస్వామి మాజీ శాసనసభ్యులు మురళీకృష్ణ వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ మురళి నాయుడు జిల్లా ఓబీసీ నాయకులు లక్ష్మణ్ నాయుడు కోడుమూరు మాజీ కన్వీనర్ సద్దల మధు కిషోర్ సీనియర్ నాయకులు కోడుమూరు అసెంబ్లీలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**కదిరి-సూర్య వాస్తవం, జులై 28:** కూటమి ప్రభుత్వం సమిష్టి సహకారంతో కదిరి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పట్టణంలో విద్యుత్‌కు అంతరాయాలు కలుగకుండా అండర్ కేబుల్ విధానానికి సుమారు ఐదు కోట్ల రూపాయలతో పనులతో ప్రారంభానికి శ్రీకారం చుట్టారు, అంతేకాకుండా పట్టణాభివృద్ధిలో భాగంగా 43 లక్షల రూపాయలతో సీసీ కెమెరాలు ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాట్లకు ఆరంభించారు, అందులో భాగంగా కుటాగుళ్ల పులివెందుల బైపాస్ రోడ్డు పూర్తి చేయడంలో భాగంగా భూసేకరణ ప్రక్రియ ఆలస్యం అవుతుందని కారణంగా దానిని వరి తగతిన పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు, శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణ పుర ప్రజలకు ఆధ్యాత్మికంగా పెంపొందించే విధంగా దేవాలయ తిరువీధుల్లో కేంద్రంగా విద్యుత్ అంతరాయం కలగకుండా అండర్ కేబుల్ విధానానికి సుమారు ఐదు కోట్ల రూపాయలతో పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు , రైతులు తమ వ్యవసాయ అభివృద్ధి రంగానికి దిగుబడి అయ్యే పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పట్టణ నలువైపులా రైతు బజార్లు ఏర్పాటు చేస్తామని ఈరోజు హామీ ఇవ్వడం జరగడం విశేషం, అంతేకాకుండా పట్టణ నలువైపులా స్మశాన వాటికకు భూమి కేటాయింపు చర్యలో



భాగంగా ఆర్డిఓ, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నిసా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి జనసేన నాయకులు భైరవ ప్రసాద్ ఆర్డీవో వివిఎస్ శర్మ, డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, వైస్ చైర్ మెన్ రాజశేఖర్ ఆచారి, బాబయ్య, ఆల్ఫా ముస్తఫా, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మహిళ నాయకురాలు పర్వీన్ భాను, మహిళా దళిత నాయకురాలు ప్రేమలత, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**పెళ్లకూరు -సూర్యా వాస్తవం, జూలై 28:** మండల పరిధిలోని నెలబల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 7 ప్రభుత్వ భూమిలో సోమవారం రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు తెలుపుతూ గత వారం రోజుల క్రితం సర్వే నెంబర్ 7 భూమిలో భూమి ఆక్రమించుకొని దున్ని చదును చేశారు, ఈ విషయంపై రెవిన్యూ శాఖ అధికారులు దున్నుతున్న భూమిని ఆపేశారు, తాసిల్దార్ శైలకుమారి ఆదేశాల మేరకు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ఎవరు ఈ భూమిని ఆక్రమించకో కూడదు అలా ఆక్రమించుకున్న ఎడల అట్టివారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రెవిన్యూ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి భూమి చుట్టూ వేసి ఉన్న గేనియాలు జెసిపి ద్వారా తొలగించి అందులో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బోర్డులు ఏర్పాటు కార్యక్రమంలో విఆర్ఓ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజ్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ వైఫల్యం

### -ప్రభుత్వం చెప్పింది కొండంత - చేసింది మాత్రం గోరంత - యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజ

**చెన్నూరు -సూర్య వాస్తవం,జూలై 28:**

పిఆర్సి బకాయిలు, డిఏ బకాయిలు, ఈ ఎల్ ఎన్కాస్మెంట్ కు సంబంధించి 2002 నుండి పెండింగ్లో ఉన్నాయని వాటన్నింటి నెరవేర్చాలని ఉద్యోగస్తులు కోరినప్పటికీ, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని చెప్పేది కొండంత చేసేది మాత్రం గోరంత అంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, మండల అధ్యక్షులు నాగిరెడ్డి, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ కౌన్సిలర్ కే. గంగన్న, నాయకులు శివ ప్రసాద్ వసంత ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వారు ప్రభుత్వ తీరుపై సోమవారం వారు చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన ఫలితంగా నేడు నూతన ప్రభుత్వం అవిర్భవించిందని నూతన ప్రభుత్వం ఏర్పాటుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ఎంతో దోహదపడ్డారని ఈ విషయాన్ని కూటమి అర్థం చేసుకోవాలని వారు కూటమి ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్య పరంగా, ఉద్యోగ పరంగా అంతా మంచి జరుగుతుందని ఉపాధ్యాయ సమస్యలు సకాలంలో పరిష్కారం అవుతాయని ప్రభుత్వం పై కొండంత ఆశ పెట్టుకున్నా ఉద్యోగులకు ఉపాధ్యాయులకు గోరంత సాయం మాత్రమే లభించిందని వారు అన్నారు. గత ప్రభుత్వం పిఆర్సి బకాయిలు డి ఏ బకాయిలు ఈ ఎల్ ఎన్కాష్మెంట్ కు సంబంధించి 2022 నుంచి పెండింగ్ లో ఉన్నాయని వాటిని చెల్లించటంలో ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఎపిజిఎల్ఐ పిఎఫ్ లాంటి ఆర్థిక బకాయిల చెల్లింపులు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ గత ఒక ప్రభుత్వం వేసిన పిఆర్సి కమిటీ చైర్మన్ రాజీనామా చేయడంతో పిఆర్సి కమిటీ రద్దయి పోయిందని ఈ ప్రభుత్వం పి ఆర్ సి కమిటీ వేయకపోవడం ఐఆర్ ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. అలాగే ఉపాధ్యాయులకు కమిటేషన్ గ్రాచ్యూటీ తదితర ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన పిఆర్సి కమిటీ వేస్తుందని సకాలంలో ఐ ఆర్ 29 శాతం ప్రకటిస్తుందని పెండింగ్ డిఏలు చెల్లిస్తుందని అదేవిధంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు కమిటేషన్ గ్రాచ్యూటీ సకాలంలో చెల్లిస్తుందని ఎన్నో కలలు కన్నా ఉద్యోగులు ఉపాధ్యాయులకు పెన్షనర్లకు తీవ్ర నిరాశ మిగిలిందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి ముఖ్యమంత్రి స్పందించి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న దాదాపు 25వేల కోట్ల రూపాయలు ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని ఐఆర్ 29శాతం శాతం ప్రకటించాలని పిఆర్సి కమిటీ నియమించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎస్‌బిఐ బ్యాంక్‌లో భారీ చోరీ



**హిందూపురం- సూర్య వాస్తవం, జులై 28:** పురం రూరల్ మండలం తూముకుంట ఎస్బిఐ ఇండస్ట్రియల్ ఏరియా స్టేట్ బ్యాంక్ ఆదివారం చోరీ జరిగినట్టు సోమవారం బ్యాంక్ అధికారులు తెలిపారు. బ్యాంకు వెనుక వైపు నుంచి కిటికీ గ్రిల్ గ్యాస్ కట్టర్ తో కట్ చేసి లోపలికి చొరబడి భారీ మొత్తంలో నగదు బంగారం దొంగలించడం జరిగింది. పెద్ద మొత్త లో చోరీకి జరిగినట్టు ఇంకా అంచనా వేయలేదని అధికారులు తెలిపారు . విషయాన్ని క్లూటీమ్స్ దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడించనున్నారు. ఉదయం నుంచి డిఎస్పి మహేష్, టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం రూరల్ అఫ్గేడ్ ఎస్పై ముని ప్రతాప్, వన్టౌన్ ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది విచారణ చేస్తున్నారు....

## విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 28:** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని శక్తి బృందాలు పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళా విభాగం డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా పర్యవేక్షణలో జిల్లాలో ఉన్న శక్తి బృందాలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. అత్యవసర సమయంలో మహిళలు తక్షణ సహాయం పొందేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్న విషయాన్ని తెలియజేశారు. యాప్ ఉపయోగించే విధానం గురించి వివరించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు అక్కడక్కడ జరుగుతున్నాయని, ఇది చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల బాలికలకు ఆరోగ్యపరంగా అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు. గుడ్ టచ్ %-% బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేస్తే వెంటనే గురువులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థులకు సోషల్ మీడియా వాడకంపై అప్రమత్తంగా వ్యవహరిం చాలన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లు 100, 112 గుర్తుంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉన్నా/ అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిసిన భయపడకుండా హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకొని పోలీసులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

## కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డిపై వేటు..?

**కదిరి - సూర్య వాస్తవం, జూలై 28:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డిపై వేటు పడినట్లు సమాచారం అందింది. ఆయనను వీ.ఆర్ కు పంపుతూ ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. కదిరిలో అధికార టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారం రెండు వర్గాల మధ్య చిచ్చురేపింది. అందులో ఒక వర్గానికి సీఐ వత్తాసు పలుకుతున్నట్లు పార్టీ ప్రత్యర్థి వర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేయడం.. అధిష్టానం సీరియస్ గా పరిగణించి సీఐని వీఆర్ కు పంపడం సంచలనంగా మారింది.



# ఘాటీ ఏదీ తేల్చడం లేదుగా!

**- కొన్ని సినిమాలు ఏ ముహూర్తాన మొదలవుతాయో కానీ అవి రిలీజవడానికి ఎన్నో ఆటంకాలు ఎదురవుతూ ఉంటాయి**

కొన్ని సినిమాలు ఏ ముహూర్తాన మొదలవుతాయో కానీ అవి రిలీజవడానికి ఎన్నో ఆటంకాలు ఎదురవుతూ ఉంటాయి. చెప్పుకోలేని కారణాల వల్ల వాయిదాల మీద వాయిదాలు పడుతుంటాయి. అలాంటి కోవలోకే వస్తుంది టాలీవుడ్ లో తెరకెక్కుతున్న ఘాటీ సినిమా. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో వస్తోన్న సినిమా ఘాటీ. ఇప్పటికే రెండుసార్లు వాయిదాలు వీరమల్లు సినిమా లేటవుతుందని ఆ ప్రాజెక్టు నుంచి బయటికొచ్చి మరీ క్రిష్ ఈ సినిమాను మొదలు పెట్టారు. మొదట్లో చాలా ఫాస్ట్ గానే షూటింగ్ ను కూడా చేశారు. కానీ తర్వాత్తర్వాత ఘాటీ లేటవుతూ వస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రెండు సార్లు పోస్ట్‌పోన్ అయింది. ముందు ఏప్రిల్ 18న రిలీజ్ చేద్దామనుకున్నారు, ఆ తర్వాత జులై 11 అన్నారు. కానీ ఆ రెండు డేట్స్ లో ఘాటీ రాలేదు. పోస్ట్ ప్రొడక్షన్ వల్లే లేటు ఎప్పటికప్పుడు ఘాటీ వాయిదా పడుతూనే ఉంది. ఏదో చెప్పాలి కాబట్టి పోస్ట్ ప్రొడక్షన్ వల్ల లేటవుతుందంటున్నారు కానీ ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఘాటీ ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి కాలేదంటే నమ్మశక్యంగా లేదు. అసలు సినిమా ఎందుకు వాయిదా పడుతుందనేది చిత్ర యూనిట్‌కే తెలియాలి. ఇదిలా ఉంటే రీసెంట్ గా ఘాటీ మూవీ సెప్టెంబర్ 5న రిలీజ్ అవుతుందని మొన్నటివరకు ప్రచారం జరిగింది. కానీ ఇప్పుడా సూచనలు కూడా కనిపించడం లేదు. ఎటూ తేల్చని ఘాటీ టీమ్ ఇప్పుడదే డేట్ లో తేజ సజ్జ మిరాయ్ వస్తుంది కాబట్టి ఘాటీ రానట్టే. ఒకవేళ తేజ సజ్జ సినిమా ఏం పోటీలే అని వద్దామనుకుంటే ఇప్పటికే ప్రమోషన్స్ ను మొదలు పెట్టాల్సింది కానీ ఇంకా ఘాటీ నుంచి ఎలాంటి సౌండ్ లేదు. అటు డైరెక్టర్ క్రిష్ కానీ, ఇటు నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ కానీ, హీరోయిన్ అనుష్క కానీ ఈ సినిమా ఊసే ఎత్తకపోగా అసలెక్కడా బయట కనిపించడం కూడా మానేశారు. ఏదేమైనా రిలీజ్ డేట్ విషయంలో నిర్మాణ సంస్థ ఏదొక క్లారిటీ ఇస్తే బెటర్. బయటకు రాని స్వీటీ ఇదిలా ఉంటే అనుష్క మాత్రం మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమా తర్వాత బయటెక్కడా కనిపించింది లేదు. ఆ సినిమాతో హిట్ అందుకున్నా సైలెంట్ గానే ఉన్నారు తప్పించి బయటకు ఎక్స్‌పోజ్ అవలేదు. తన గురించి, తన సినిమాల గురించి ఎన్ని వార్తలొస్తున్నా సరే అవేవీ పట్టించుకోకుండా అజ్ఞాతంలోనే ఉండిపోతున్నారు తప్పించి బయటకు మాత్రం రావడం లేదు.

# లోకేష్ నోట శృతి మాటలు వైరల్..!

**- తాజాగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఒక ఇంటర్వ్యూలో సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతే కాకుండా సినిమాలో కీలక పాత్రలో నటించిన శృతి హాసన్ గురించి కూడా కామెంట్స్ చేశాడు**



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' సినిమా మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాపై కేవలం తమిళనాట మాత్రమే కాకుండా తెలుగు, హిందీ ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉన్నాయి. ఈయన గత చిత్రాలు విక్రమ్, లియో సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే లోకేష్ కనగరాజ్ సినిమా అనగానే అన్ని భాషల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. లోకేష్ కనగరాజ్ భాషతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించగల సమర్థుడు అని ఇప్పటికే నిరూపితం అయ్యింది. కనుక కూలీ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనడంలో సందేహం లేదని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 'కూలీ' సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమోషన్స్ హడావిడి మొదలైంది. ఇప్పటికే చిత్ర యూనిట్ సభ్యులు ప్రమోషన్ కి సంబంధించిన స్టఫ్‌ను విడుదల చేస్తూ వచ్చారు. తాజాగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఒక ఇంటర్వ్యూలో సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతే కాకుండా సినిమాలో కీలక పాత్రలో నటించిన శృతి హాసన్ గురించి కూడా కామెంట్స్ చేశాడు. వీరిద్దరూ కూలీ సినిమాకు ముందు ఒక మ్యూజిక్ ఆల్బం కోసం వర్క్ చేసిన విషయం తెల్సిందే. ఆ అనుబంధంతోనే కూలీ సినిమాలో నటించేందుకు గాను శృతి హాసన్ ఓకే చెప్పిందని తెలుస్తోంది. విక్రమ్ సమయంలోనూ వీరిద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవని కొందరు అంటున్నారు. %ూశ్రీంశీ =ముఎ% - వివాదంలో చిక్కుకున్న బాలీవుడ్ నటుడు తాజా ఇంటర్వ్యూలో లోకేష్ కనగరాజ్ మాట్లాడుతూ కూలీలో శృతి హాసన్ పాత్ర గురించి క్లారిటీ ఇచ్చాడు. ఒక మంచి పాత్రలో శృతిని చూడబోతున్నారు అన్నాడు. అంతే కాకుండా శృతి హాసన్‌ను వ్యక్తిగతంగా ప్రశంసించాడు. సెట్‌లో శృతి హాసన్ ఉంటే చాలా ఎనర్జీ ఉన్నట్లుగా ఉండేది. సెట్ నిండా మగవారు ఉన్నా కూడా శృతి హాసన్ ఎలాంటి ఇబ్బంది లేకుండా తనకు చెప్పిన సీన్‌ను చేస్తూ ఉండేది. అందరితోనూ చాలా సన్నిహితంగా ఉండేది. సెట్‌లో చాలా ఉత్సాహంగా ఉండటంతో పాటు, ఆమెకు చెప్పిన సీన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండేది. షూటింగ్ చేసుకుని బయట పడాలి అనుకునే రకం శృతి హాసన్ కాదని లోకేష్ చెప్పుకొచ్చాడు. ప్రమోషన్స్ సమయంలో శృతి హాసన్ నుంచి చాలా సహాయం అందుతుందని కూడా లోకేష్ చెప్పుకొచ్చాడు. ప్రమోషన్ వీడియోలు చేయడం, పాటలు రాయడం, పాడటం వంటివి చేస్తుంది. చాలా మంది హీరోయిన్స్ ప్రమోషన్స్‌ను పట్టించుకోరు. కానీ శృతి హాసన్ మాత్రం సినిమా విడుదల అయ్యేంత వరకు యూనిట్ సభ్యులకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, ఆమె గొప్ప వ్యక్తిత్వం ఉన్న హీరోయిన్ అన్నట్లుగా చెప్పుకొచ్చాడు. సినిమాను జనాల్లోకి తీసుకు వెళ్లడం కోసం ఆమెకు చేతనైన సాయం చేసేందుకు ఎప్పుడూ ముందు ఉంటుంది. కూలీ సినిమాలో ఆమె పాత్ర తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. వరుస బ్రేకప్స్ కారణంగా శృతి హాసన్ కాస్త నిరుత్సాహంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమా తర్వాత శృతి పుంజుకుంటుందేమో చూడాలి.



# దేశభక్తి వర్సెస్ క్రికెట్ వాణిజ్యం
# బీసీసీఐపై తీవ్ర విమర్శలు

**- ఆసియా కప్ 2025లో భాగంగా సెప్టెంబర్ 14న భారత్-పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయనే వార్త దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది**

ఆసియా కప్ 2025లో భాగంగా సెప్టెంబర్ 14న భారత్-పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయనే వార్త దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా జమ్మూ-కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన తాజా ఉగ్రదాడి, అందులో 26 మంది అమాయకుల ప్రాణాలు కోల్పోవడం, ఈ దాడికి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులే కారణమని అధికారికంగా ధృవీకరించబడటంతో ఈ వివాదం మరింత జటిలమైంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటంపై దేశంలోని ప్రతిపక్ష పార్టీలు, నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ప్రియాంక చతుర్వేది ఈ విషయంలో అత్యంత తీవ్రంగా స్పందించారు. "భారతీయ సైనికులు, నిరపరాధుల రక్తం తాగిన దేశంతో క్రికెట్ ఆడటమా? రక్తంతో లాభాన్ని ఆర్జించడమేంటీ?" అంటూ బీసీసీఐపై నేరుగా ప్రశ్నలు సంధించారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ప్రతిపక్షాల మనోభావాలకు అద్దం పడుతు న్నాయి. అనేక మంది ప్రతిపక్ష నాయకులు సైతం ఇదే తరహాలో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ దేశ భద్రత, సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడకూడదని డిమాండ్ చేస్తున్నారు .పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నప్పుడు, ఆ దేశంతో సాధారణ సంబంధాలు, ముఖ్యంగా క్రీడా సంబంధాలు కొనసాగించడం దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని వారు వాదిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా నిరసన రాజకీయ నాయకులతో పాటు, సామాన్య ప్రజలు సైతం సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు. వఇది ప్రజలలో ఉన్న తీవ్ర అసంతృప్తిని



స్పష్టం చేస్తోంది. "జవాన్ల రక్తానికి విలువ లేదా?" అంటూ నెటిజన్లు బీసీసీఐ నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్నారు. దేశభక్తి భావనలు ఉప్పొంగుతున్న ఈ తరుణంలో, క్రికెట్ మ్యాచ్‌ను రద్దు చేసి, అమరుల త్యాగాలకు గౌరవం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దేశ భద్రతకు సంబంధించిన విషయాలను క్రికెట్ వంటి వాణిజ్య కార్యక్రమాలతో కలపడం తగదని, జాతీయ భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు బీసీసీఐకి సూచిస్తున్నారు.

# బెన్ స్టోక్స్ - జడేజా మధ్య ఏమైంది..?
# వైరల్ వీడియో ఇండియా

**ఇంగ్లాండ్ నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి ఒక ఆసక్తికర సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది**



ఇంగ్లాండ్ నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి ఒక ఆసక్తికర సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మ్యాచ్ డ్రాగా ముగిసిన తర్వాత, ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లతో చేతులు కలిపే విషయంలో తిరస్కరించాడనే వీడియో వైరల్ అవుతోంది. నాలుగో టెస్టులో భారత జట్టు అత్యుత్తమ పోరాటం చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఇదొక విజయం కాకపోయినా, సిరీస్‌లో నిలబడే అవకాశం భారత్‌కి ఇచ్చింది. కానీ మ్యాచ్ ముగిశాక జరిగిన ఓ చిన్న సంఘటన అభిమానుల్లో కలకలం రేపుతోంది. అసలేం జరిగిందంటే? సాధారణంగా మ్యాచ్ ముగిసిన తర్వాత రెండు జట్ల ఆటగాళ్లు, సిబ్బంది పరస్పరం చేతులు కలుపుతూ గౌరవం చూపుతారు. కానీ మ్యాచ్‌లో స్టోక్స్ మాత్రం జడేజా , వాషింగ్టన్ సుందర్‌తో చేతులు కలపలేదు. దీనికి ముఖ్య కారణం మ్యాచ్ ముగిసే 15 ఓవర్లు ముందు, స్టోక్స్ మ్యాచ్‌ను డ్రా చేద్దాం అని సూచించాడు. అయితే జడేజా , సుందర్ ఆ అభ్యర్థనను తిరస్కరించారు. ఎందుకు తిరస్కరించారు? ఆ సమయంలో భారత్ పూర్తి ఆధిపత్యంలో ఉండగా, ఇంగ్లాండ్ గేమ్‌లో తిరిగి వచ్చే అవకాశం లేదు. పైగా జడేజా , సుందర్ ఇద్దరికీ సెంచరీ పూర్తిచేయాలన్న వ్యక్తిగత లక్ష్యం ఉండటంతో, వారు ఆట కొనసాగించాలని నిర్ణయించారు. దీన్ని స్టోక్స్ స్వాగతించలేదు. దీనిపై అసహనం వ్యక్తం చేస్తూ, మ్యాచ్ చివరిలో ఆయన హావభావాల్లో అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. క్లోజింగ్ సీన్ మ్యాచ్ ముగిశాక రెండు జట్లు షేక్ హ్యాండ్ చేయగా కెప్టెన్ స్టోక్స్ మాత్రం జడేజా, సుందర్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టించుకోలేదు. ఈ ఘటన వీడియో రూపంలో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది అభిమానుల్లో మిశ్రమ స్పందనలకు దారితీస్తోంది. స్పోర్ట్స్‌మన్ షిప్ అంటే గెలుపోటములకన్నా ఎంతో ముఖ్యం. స్టోక్స్ వంటి సీనియర్ ఆటగాడు ఇలాంటి ప్రవర్తన చేయడం పట్ల కొందరు విమర్శలు చేస్తుండగా, మరికొందరు అతనికి మద్దతు కూడా ప్రకటిస్తున్నారు. అయినా, జడేజా , సుందర్ తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేసిన తీరు మాత్రం ప్రశంసనీయం. ఈ ఘటనపై బీసీసీఐ లేదా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు స్పందిస్తాయో లేదో వేచి చూడాలి.

# 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత



**తిరుపతి-సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బ్యాడ్జిని అధికారులు చంద్రబాబుకు అందించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. "కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాను. ఆ కుటుంబాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపు ఇస్తున్న నేను.. చెప్పడమే కాదు.. ఆచరించి చూపాలని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసు కుంటున్నా. ఈ కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రణాళిక రూపొందిస్తాను. ఐయామ్ ఏ మార్గదర్శి. సమాజంలో పేద-ధనికుల మధ్య అంతరాలు తగ్గించే ఇలాంటి కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తే.. ఇప్పుడు పేదలను ఆదుకునేందుకు పీ4 అమలుకు ప్రణాళికలు చేపట్టాం. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూపొందించాం. పేదలకు చేయూతనిచ్చే పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబాలుగా నమోదైన వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి. ఇవాళ్టి బంగారు కుటుంబాలు.. రేపటి మార్గదర్శులుగా ఎదగాలన్నదే నా ఆలోచన. సాయం పొందిన సాయం చేసేందుకు ముందుకు వస్తారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి. దీన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే ఈ కార్యక్రమం శాశత్వంగా ఉండిపోతుంది. చాలా మందికి మంచి ఆలోచనలు ఉంటాయి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాలున్న వారు పేదరికం కారణంగా వెనుకబడిపోతున్నారు. ఇలాంటి వారికి చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఎన్నో కార్యక్రమాలు చేసిన నాకు.. పీ4 కార్యక్రమం మనస్సుకు చాలా దగ్గరగా ఉంది" అని చంద్రబాబు అన్నారు."బంగారు కుటుంబాలుగా నమోదైన వారి అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తాం.

బంగారు కుటుంబాలు అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది.. వాళ్లు చేయగలిగే పనులేంటీ..? అనే అంశాలపై ఓ పది పాయింట్లతో కూడిన సర్వే చేపడుతున్నాం. వీరి అభివృద్ధికి ఏం చేస్తున్నామనే విషయాన్ని వివరించేందుకు ప్రతి బంగారు కుటుంబానికి విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికల ద్వారా వారి అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం. బంగారు కుటుంబాల స్థితిగతులపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష చేపట్టాలి." అని సీఎం అన్నారు.

ప్రతిష్టాత్మక "పీ4" పథకంపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో "పీ4" పథకం లోగోను ఆవిష్కరించారు.? "ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి విడత ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నా దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకు పని చేయాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్ర స్థాయి ఉద్యోగి వరకు కృషి చేయాలి. బంగారు కుటుంబాలను.. మార్గదర్శులను గుర్తించే విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగ్గా పని చేయాలి.

వచ్చే 15 రోజుల్లో దీని కోసం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కసరత్తు చేయాలి. ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి." అని సీఎం సూచించారు. జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. సీఎం స్ఫూర్తితో తాను కూడా ఐదు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ ప్రకటించారు. షాజహాన్ ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ తరహా కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తామని ప్రజా ప్రతినిధులు సీఎంకు హామీనిచ్చారు

# 2026 నాటికి స్టీల్ ప్లాంట్ పూర్తి



**కడప-సూర్య వాస్తవం:** వైఎస్సార్ కడప జిల్లా వాసులకు గుడ్ న్యూస్.. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తరుణం సమీపిస్తోంది. కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు విషయం చాలా రోజుల నుంచి నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సున్నపురాళ్లపల్లెలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ.. ఏపీ పారిశ్రామికాభివృద్ధి పాలసీ ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వాలని, చర్యలు తీసుకోవాలని విద్యుత్, పరిశ్రమలు, జలవనరులు, రెవెన్యూ, ఆర్థిక శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. రూ.4,500 కోట్లతో సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రూ.11,850 కోట్లతో స్టీల్ ప్లాంట్ రెండో దశ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ఏపీ ప్రభుత్వం 1100 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఎకరా రూ. 5లక్షల చొప్పున ఈ భూమిని కేటాయించింది. 2026 జనవరి నాటికి కడప స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు ప్రారంభించాల్సి ఉంది. అలాగే 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇక 2029 ఏప్రిల్ సమయానికి స్టీల్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో సకాలంలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ప్రోత్సాహకాలు ఇవ్వటంతో పాటుగా విద్యుత్, నీరు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులను 2031 జనవరి నాటికి మొదలుపెట్టనున్నారు. 2034 ఏప్రిల్ వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశలోనూ ఉత్పత్తి ప్రారంభించాలని నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే మూడు మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో రెండు దశలలో కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో ఒక మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని.. రెండో దశ కల్లా ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 2 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు 1100 ఎకరాల భూమిని 33 సంవత్సరాలు లీజుకు ఇచ్చారు.ఇక కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే పలుసార్లు శంకుస్థాపనలు చేశారు. 2023లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ భూమి పూజ చేసింది. తాజాగా జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ స్టీల్ ప్లాంట్ మొదటి దశ నిర్మాణం ద్వారా ప్రత్యక్షంగా 3,200 మందికి, పరోక్షంగా 25,000 మందికి ఉపాధి అవకాశాలు. లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.

# చెత్త తీసుకెళ్లి.,..బహుమతులు తీసుకోండి



**గుంటూరు-సూర్య వాస్తవం:** చెత్తే కదా అని వేస్టు కింద లెక్కగట్టకండి. చెత్త కాదు అది సంపద అంటోంది ఏపీ ప్రభుత్వం. అందుకే చెత్త సేకరణ చేస్తోంది. చెత్తతో సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతోంది. ఇదే క్రమంలోనే గుంటూరు జిల్లా పొన్నూరును చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు నడుం బిగించారు. పొన్నూరు మున్సిపాలిటీ ఐటీసీ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఇక ఒప్పందంలో భాగంగా పొన్నూరు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెత్త సేకరణపై ఐటీసీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారు. అలాగే ఓ సంచి అందిస్తారు. స్కూలుకు వచ్చే టప్పుడు ఈ సంచీలో ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకురావాల్సి ఉంటుంది. ఆ చెత్తను తూచి వారికి బహు మతులు అందిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛాం ధ్రప్రదేశ్‌గా మార్చాలనే పట్టుదలతో ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. అలాగే చెత్త వేస్తే నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేసే స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని గుంటూరు గ్రామీణ మండలంలో ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారం భించారు. వీటితో పాటుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా పొన్నూరును చెత్తరహిత పట్టణంగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. పొన్నూరులో తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తూ ఉంటారు. అయితే ఇక్కడి నుంచి వ్యర్థాల తొలగింపు లేకపోవటంతో డంపింగ్ యార్డులో చెత్త గుట్టలు గుట్టలుగా పెరిగి పోయింది. ఈ స్థాయిలో చెత్తను బయటకు తరలించాలంటే పొన్నూరు మున్సిపాలిటీకి ఆర్థికంగా ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలోనే పొన్నూరు మున్సిపాలిటీ అధి,కారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చెత్తను తరలించేందుకు ఐటీసీ సంస్థతో పొన్నూరు మున్సిపాలిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ సూచ నలతో పొన్నూరు మున్సిపాలిటీ, ఐటీసీ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణకు కొత్త విధానాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఇక్కడి నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మరికొన్ని చోట్ల ఇదే తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.ఈ విధానంలో భాగంగా పొన్నూరులోని స్కూళ్ల విద్యార్థుల నుంచి చెత్త సేకరించి వారికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. పొన్నూరు పరిధిలోని జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారుగా 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అంచనా. ఐటీసీ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు చెత్త సేకరణ, వాటి నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో అవగాహన కల్పిస్తారు. అలాగే ప్రతి విద్యా?ర్థికి ఓ సంచీని అందజేయనున్నారు. రోజూ ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో విద్యార్థులు ఆ సంచీలో తమ ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకుని రావాల్సి ఉంటంది. అలా తీసుకువచ్చిన పొడిచెత్తను తూకం వేసి.. ఆ బరువు ప్రకారం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తారని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.లాగే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి వెళ్లి మున్సిపాలిటీ అధికారులు, ఐటీసీ ప్రతినిధులు చెత్త సేకరణ, ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అలాగే సేకరించిన తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే ప్రయత్నం చేస్తామని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.

# అనిల్ కుమార్ మిస్సింగ్...



**నెల్లూరు-సూర్యవాస్తవం:** అధికారంలో ఉన్నప్పుడు ఎన్నైనా మాట్లాడవచ్చు. ఏవేవో మాట్లాడవచ్చు. ఎంతటి మాటలనైనా అనే యవచ్చు. కానీ అధికారం కోల్పోతే ఉంటుంది సామిరంగా. అచ్చం అనిల్ కుమార్ యాదవ్ లా ఉంటుంది. ఓ చిన్నపాటి కేసులో విచారణకు ఆయనను పిలిచారు పోలీసులు. కానీ దుమ్మా కొట్టి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు అనిల్ కుమార్ యాదవ్. తనపై పోలీసులు పెట్టిన కేసు కొట్టి వేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అనిల్ కుమార్ యాదవ్ లో భయాన్ని చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముక్కున వేలేసు కుంటున్నాయి. ఏంటి మన అనిల్ యేనా? అని ఆశ్చర్యపోతున్నాయి. అనిల్ కుమార్ యాదవ్ తీరును చూసి నవ్వుకుంటున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు తొడలు కొడుతూ.. మీసం మేలేస్తూ అనిల్ కుమార్ యాదవ్ చేసిన హంగామా అంతా అంతా కాదు. ఇప్పటికీ ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.మొన్న ఆ మధ్యన నెల్లూరు జిల్లాలో ఒక వివాదం నడిచిన సంగతి తెలిసిందే. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పై (మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. అదే సమయంలో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటి పై దాడి కూడా జరిగింది. అయితే ప్రసన్న కుమార్ రెడ్డిని పరామర్శించే క్రమంలో ప్రశాంతి రెడ్డి పై అనిల్ కుమార్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిని ఖండిస్తూ ప్రశాంతి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కేసులో ఏ1 గా ప్రసన్న కుమార్ రెడ్డి, ఏ 2 గా అనిల్ కుమార్ యాదవ్ గా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణకు హాజరుకావాలని అనిల్ కుమార్ యాదవ్ కు నోటీసులు అందించారు. కానీ ఏ 1 గా ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి హాజరయ్యారు, ఏ 2 గా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అలా వెళ్తూనే హైకోర్టులో తనపై కేసు కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన విస్మయం వ్యక్తం అవుతుంది. చిన్నపాటి కేసుకే అనిల్ భయపడిపోతున్న తీరును వారు తప్పు పడుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్అధికారంలో ఉన్నప్పుడు అనిల్ కుమార్ యాదవ్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయేవారు. మీసం మేలేసేవారు.. తొడగొట్టేవారు. పవన్ కళ్యాణ్ తో పాటు లోకేష్ ను తక్కువ చేసి మాట్లాడేవారు. చంద్రబాబు వయసును చూసి కూడా గౌరవించిన దాఖలాలు లేవు. అయితే ఇప్పుడు అధికారం తారుమారు కావడంతో అసలు తత్వం బోధపడింది. ఎన్నికల ఫలితాల తర్వాత అనిల్ కుమార్ యాదవ్ రాష్ట్రంలోనే ఉండడం లేదు. పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు అనవసరంగా వచ్చి చిన్నచిన్న కేసుల్లో ఇరుక్కుంటున్నారు. అసలు పెద్ద కేసులు ఆయన కోసం ఎదురుచూస్తున్నాయి. ముమ్ముందు చుక్కలు కనిపించే పరిస్థితులు ఉన్నాయి. కానీ చిన్నపాటి దూషణ కేసును కూడా ఆయన ఎదుర్కొనలేకపోతున్నారు. ముమ్ముందు పెద్ద కేసులు ఎదురైతే పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది.అయితే ప్రశాంతి రెడ్డి పై దూషణ కేసుకు సంబంధించి అనిల్ కుమార్ యాదవ్ భయపడడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. ఈ కేసులో ఏ 1 ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి ని పోలీసులు అరెస్టు చేయలేదు. కానీ తన విషయంలో మాత్రం అరెస్టు ఉంటుందని అనిల్ కుమార్ యాదవ్ కు తెలుసు. ఎందుకంటే క్వార్జ్ కుంభకోణం కేసులో ఆయన పిఏ ఇప్పటికే అరెస్టయ్యారు. ఆయన ఇచ్చిన సమాచారంతో అనిల్ కుమార్ కు కూడా ఈ కుంభకోణంతో సంబంధాలు ఉన్నాయని ఆధారాలు సేకరించారు పోలీసులు. అందుకే హైకోర్టు కలుపుతారు అనిల్ కుమార్ యాదవ్. పేరు దూషణ కేసు అయిన.. మైనింగ్ కుంభకోణం కేసులో బయటపడేందుకే నన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికైతే అనిల్ కుమార్ యాదవ్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది.

# మారనున్న ఓర్వకల్లు



**కర్నూలు - సూర్యవాస్తవం:** కర్నూలు జిల్లాలోని ఓర్వకర్లు సమీపంలో ఉన్న నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ టెస్ట్ రేంజ్‌లో లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ క్క ఫ్లైట్ ట్రయల్స్‌ను డీఆర్‌డీఏ విజయవంతంగా నిర్వహించింది. భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఈ విజయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా లో ప్రకటించారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండలం, పాలకొలను సమీపంలో నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ ఉంది. ఔాంఖీ అనేది అత్యాధునిక రక్షణ సాంకేతికతలను పరీక్షిం చడానికి డీఆర్ డీఓ ఉపయోగించే కీలక సౌకర్యం, ఇది గతంలో హై-ఎనర్జీ లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ పరీక్షలకు కూడా ఉపయోగించబడింది. వైవీకేజెడ్-వీ3 ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి, ఇది భారత్ కు చెందిన డ్రోన్-లాంచ్‌డ్ ప్రెసిషన్ స్ట్రైక్ సామర్థ్యాలలో ఎంతో కీలకమైనది. సిరీస్‌లో మూడు తెలిసిన వేరియంట్‌లు ఉన్నాయి. డీఆర్ డీఓ టెర్మినల్ బాలిస్టిక్స్ రిసెర్చ్ లాబొరేటరీ ద్వారా అభివృద్ధి చేసిన ప్రొడక్షన్ వేరియంట్ బహుళ వార్‌హెడ్ కాన్ఫిగరేషన్‌లతో ఉంటుంది. ఎక్స్‌టెండెడ్ రేంజ్ వేరియంట్, ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ , డ్యూయల్-థ్రస్ట్ ప్రొపల్షన్ సిస్టమ్‌లతో మెరుగైన ఫీచర్లను కలిగి ఉంది. ఈ వేరియంట్ ను 2025లో ప్రదర్శించారు. ఈ మిస్సైల్ సిస్టమ్ తేలికైనది, ఖచ్చి తమైనది, వివిధ ఏరియల్ ప్లాట్‌ఫామ్‌లతో అనుకూలంగా ఉంటుంది, ఇది ఆధు నిక యుద్ధాలలో వ్యూహాత్మక సౌలభ్యాన్ని అందిస్తుంది. అదానీ గ్రూప్ , భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌లో కీలక తయారీ భాగస్వాములు.

ఈ పరీక్షలు భారత పరిశ్రమ, ముఖ్యంగా ఓూఓఇబ స్టార్టప్‌ల సామర్థ్యాన్ని సూచిస్తాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. , ఇవి కీలక రక్షణ సాంకేతికతలను గ్రహించి, ఉత్పత్తి చేయడంలో సఫల మవుతున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సహకారాన్ని ప్రశంసించారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రక్షణ పరికరాల ఉత్పత్తికి కేంద్ర స్థానంగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఇలాంటి ప్రయోగాలు ఏపీలో జరగడం వల్ల మరింత పేరు వచ్చే అవకాశం ఉంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )